ప్రజాశక్తి

బుధవారం 1 ఫిబ్రవరి 2023 | 8 పేజీలు





ఎన్‌టిఆర్ | కృష్ణా



కౌన్సిల్‌లో అధికార, విపక్ష సభ్యుల మధ్య వాగ్వాద దృశ్యం: అధ్యక్షత వహించిన మేయర్ భాగ్యలక్ష్మి

పింఛన్ల తొలగింపుపై విపక్షాల ఆగ్రహం

❁టిడిపి, సిపిఎం సభ్యుల సస్పెన్షన్ ❁మార్షల్స్ సాయంతో బయటకు గెంటివేత
❁కౌన్సిల్ హాలు వెలుపలు విపక్ష సభ్యుల ఆందోళన ❁ ఏకపక్షంగా అజెండా ఆమోదం

ప్రజాశక్తి - విజయవాడ : ప్రతిపక్ష టిడిపి, సిపిఎం సభ్యులను సస్పెండ్ చేయడంతోపాటు వారిని బయటకు గెంటేయించి చర్చకు తావివ్వకుండానే నిమిషాల వ్యవధిలో వైసిపి పాలకపక్షం అజెండాను ఏకపక్షంగా ఆమోదించుకుంది. తొలగించిన వివిధ సామాజిక పింఛన్లను పునరుద్ధరించాలని కౌన్సిల్‌లో పట్టుబట్టిన నలుగురు టిడిపి సభ్యులతోపాటు సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబును ఎంఎల్‌ఎ మల్లాది విష్ణు కనుసైగల నడుమ మేయర్ భాగ్యలక్ష్మి సస్పెండ్ చేశారు. మార్షల్స్‌తో వారిని బయటకు గెంటివేశారు. దీనికి నిరసనగా మిగిలిన టిడిపి సభ్యులు వాకౌట్ చేశారు. సమావేశం ముగిసే వరకు టిడిపి, సిపిఎం సభ్యులంతా కౌన్సిల్ హాలు వెలుపల బైఠాయించి ఆందోళన చేపట్టారు. సిపిఎం ఫ్లోర్‌లీడర్ సత్యబాబు భోజనం కూడా చేయకుండా డిమాండ్లతో కూడిన

(మిగతా 6లో)



కౌన్సిల్ హాలు బయట బైఠాయించిన టిడిపి, సిపిఎం సభ్యులు

ఫుడ్‌కోర్టు అక్రమాలపై రగడ

వార్త 6లో



సత్యబాబుకు మద్దతుగా బాబూరావు, కాశీనాథ్ తదితరుల నిరసన

సత్యబాబు సస్పెన్షన్‌పై నిరసన

నగరపాలక సంస్థలో ప్రజా సమస్యలను లేవనెత్తిన సిపిఎం కార్పొరేటర్ బి.సత్యబాబును, టీడీపీ కార్పొరేటర్లను సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబురావు, ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, సిపిఎం విజయవాడ సెంట్రల్ సిటీ కార్యదర్శి బి.రమణారావు, నగర కమిటీ సభ్యులు కే.దుర్గారావు తదితరులు కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటలకు కార్పొరేషన్ వద్దకు వెళ్లి ఆందోళన చేస్తున్న సత్యబాబుకు సంఘీభావం తెలియజేశారు. ప్రజా సమస్యలను కౌన్సిల్లో చర్చించే విధంగా చూడాలని కోరారు.



పిల్లలు కాదు పిడుగులు

❁వ్యర్థానికి అర్థం చెప్పిన చిన్నారులు ❁ఆలోచింపజేసిన ప్రదర్శనలు

ప్రజాశక్తి - గన్నవరం : బాలల్లో ఉన్న సజనాత్మకతను వెలికితీసి.. వారిలోని ప్రతిభా పాటవాలను చాటిచెప్పేందుకు గన్నవరంలో మంగళవారం నిర్వహించిన బాలల పండగ (బాలోత్సవం)కు అనూహ్య స్పందన లభించింది. దాదాపు 50 పాఠశాలలకు చెందిన బాలబాలికలు వివిధ అంశాల్లో తమ ప్రతిభను చాటేందుకు బాలోత్సవంను వేదికగా చేసుకున్నారు. గన్నవరం బాలికల ఉన్నత పాఠశాలలో కాట్రగడ్డ రవీంద్ర ఆవరణలో ఏర్పాటు చేసిన 14 వేదికలపై జూనియర్, సీనియర్ విభాగాలకు పోటీలను నిర్వహించారు. కథారచన, భరతనాట్యం, కూచిపూడి, నీతిపద్యాలు, ఏకపాత్రాభినయం, ఫోక్ డాన్స్ , ఫ్యాన్సీ డ్రెస్, స్పెల్‌బీ, సినీ, లలిత, జానపద గీతాలు, క్విజ్, లేఖారచన, వ్యర్థంతో అర్థం, మట్టి బొమ్మలు, రైతు, సామాజిక రుగ్మతలపై నాటికలు బాల బాలికలు ఆద్యంతం ఆకట్టుకునే రీతిలో ప్రదర్శనలు ఇచ్చి చూపర్ల కళ్ళను కట్టి పడవేశారు. స్వేశ్రం స్కూల్ విద్యార్థులు రైతులు పడుతున్న బాధలను పాటలో డాన్స్ ద్వారా ఎంతో చక్కగా ప్రదర్శన ఇచ్చి అందరి చేత శభాష్ అనిపించుకున్నారు. అనేక మంది విద్యార్థులు వ్యర్థ వస్తువులతో అద్భుతాలు సష్టించి వేదికపై ప్రదర్శించడం, వాటి ప్రయోజనాలను వివరణాత్మకంగా విశ్లేషించడం ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఎందుకూ పనికిరావనుకున్న వస్తువులను ఎలా ఉపయోగించుకోవచ్చు అన్న అంశాన్ని వివిధ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతి ఒక్కరూ ఆలోచించేలా వివరించారు. అరటి తొక్కను రెండు రోజులపాటు నానబెట్టి, అనంతరం పెరట్లో పెరుగుతున్న మొక్కలకు ఔషధంగా వేస్తే అవి అద్భుతంగా పెరుగుతాయని వివరించిన తీరు ఆకట్టుకుంది. ఇక చెత్త కాగితాలతో తమకేం పని అనుకునే వారికి వాటిని ఎలా సద్వినియోగం చేసుకోవచ్చో విద్యార్థులు వివరించారు. బాపులపాడు, గన్నవరం మండలాల్లోని వివిధ ప్రైవేటు స్కూల్లో నుంచి వచ్చిన బాలబాలికలు చేసిన జానపద, కూచిపూడి నత్యాలు ఆకట్టుకున్నాయి. తెలుగు భాష గొప్పదనాన్ని వివరిస్తూ వివిధ పాఠశాలకు చెందిన విద్యార్థి చేసిన నత్యం ఆకట్టుకుంది. అలాగే ఓ చిన్నారి వరాహ రూపం పాటకు చేసిన నత్యం అబ్బుర పరిచింది . పలువురు చిన్నారులు ఫ్యాన్సీ డ్రెస్, తమ వేషభాషల తో, హావభావాలతో ఇచ్చిన ప్రదర్శనలు ప్రేక్షకులను అలరింపజేశాయి. బాలోత్సవం కన్వీనర్ మాదల వెంకటేశ్వరరావు, కార్యదర్శి కర్రా వరప్రసాద్, అధ్యక్షులు బి నాగేశ్వరరావు అన్ని వేదికలను పర్యవేక్షించారు.

(మరిన్ని వార్తలు, చిత్రాలు 5వ పేజీలో)

నిధుల కేటాయింపు ఉంటుందా ?

❁కోస్తా లింక్ రైల్ మార్గానికి ఎదురుచూపులు
❁పెండింగ్‌లోనే విజయవాడ డివిజన్ రైల్వే ప్రాజెక్టులు ❁నేడు రైల్వే బడ్జెట్

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

వందే భారత్ రైళ్ల గురించి గొప్పగా ప్రచారం చేసుకుంటున్న కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాంత అభివృద్ధికి అవసరమైన రైల్వే ప్రాజెక్టులకు నిధులు కేటాయించకుండా గత కొన్నేళ్లగా తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోంది. దీంతో విజయవాడ రైల్వే డివిజన్‌లో పలు ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయి. అర్ధ దశాబ్ధకాలంగా కోస్తా రైలు లింకు మార్గంతోపాటు దీనిలో భాగంగా ఉన్న మచిలీపట్నం- రేపల్లె రైల్వే లైను ఏర్పాటుకు నోచుకోలేదు. ఈ లైను ఏర్పాటుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని బందరు పార్లమెంట్ సభ్యులు వి.బాలశౌరి కేంద్రాన్ని కోరారు. ఈ నేపథ్యంలో బుధవారం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న రైల్వే బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టులకు ఏ మేరకు నిధులు కేటాయిస్తుందనేది ఆసక్తిగా మారింది. పెండింగ్ రైల్వే ప్రాజెక్టులకు నిధులు కేటాయిస్తుందా? లేక ఎప్పటిలాగే మొండి చేయి చూపుతుందా? అనే చర్చ మొదలైంది.

సుదీర్ఘకాలంగా ఎదురుచూపులు ...

కోస్తా ప్రాంత అభివద్ధికి 216 జాతీయ రహదారి విస్తరణ, పులిగడ్డ పెనుమూడి వారధి నిర్మాణంతోపాటు కోస్తా లింకు రైలు మార్గం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ప్రభుత్వాలు గుర్తించాయి. దీని నిర్మాణానికి గతంలో అంచనాలు రూపొందించాయి. కాకినాడ - కోటిపల్లి - అమలాపురం - రాజోలు -నరసాపురం మీదుగా మచిలీపట్నం -రేపల్లె నుంచి నిజాంపట్నం -బాపట్ల వరకు లింకు రైలు మార్గం ఏర్పాటు జరిగితే మచిలీపట్నం అత్యంత ప్రధానమైన జంక్షన్‌గా ఏర్పాటయ్యే అవకాశం ఉంది. నరసాపురం నుంచి బంటుమిల్లి మీదుగా మచిలీపట్నం వరకు 74 కిలోమీటర్ల మేర

(మిగతా 6లో)

స్టడీ మెటీరియల్ అందజేత

ప్రజాశక్తి-రెడ్డిగూడెం: ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ ఆఫ్ ఫ్రీ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ సెంటర్‌లో గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతి ప్రవేశానికి జరిగే ప్రవేశ పరీక్షకు సిద్ధపడుతున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు చాట్ల విజయ్‌కుమార్ మాట్లాడుతూ గత ఎనిమిది సంవత్సరాల్లాగానే ఈ ఏడాది కూడా ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ, ఓబిసి విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వడంతో పాటు ఉచితంగా మెటీరియల్ కూడా పంపిణీ చేశామని తెలిపారు. అంతేకాకుండా వారానికి ఒక మోడల్ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవ జి.విశ్వనాథ్, సొసైటీ గౌరవ సలహాదారుడు ప్రత్తిపాటి పాల్‌ఇమ్మానుయేలు, డైరెక్టర్ చాట్ల హన్న, ప్రమీల, సుధ పాల్గొన్నారు.



చిరుధాన్యాలపై అవగాహన

ప్రజాశక్తి-రెడ్డిగూడెం: నరుకుళ్లపాడు గ్రామంలో చిరుధాన్యాలపై అవగాహన కార్యక్రమం మంగళవారం జరిగింది. కృషి విజ్ఞాన కేంద్రం సబ్జెక్ట్ మాటర్ స్పెషలిస్ట్ ప్రభావతి మాట్లాడుతూ చిరుధాన్యాల్లో పోషక విలువలు ఎక్కువగా ఉన్నాయని, వాటిని ప్రతిరోజు ఆహారంలో తీసుకుంటే విటమిన్‌లు, మాంసం కత్తులు, ప్రోటీన్‌లు, పీచు పదార్థాలు ఎక్కువగా లభిస్తాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చిరు ధాన్యాల పంటలకు ప్రత్యేక మద్దతు ధర, ఉచిత పంటల భీమా కల్పిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విస్సన్నపేట వ్యవసాయ సహాయ సంచాలకులు జే.ఎల్ కిరణ్ జ్యోతి, మండల వ్యవసాయ అధికారి రెంటపల్లి సురేష్, గ్రామ సర్పంచ్ నూనె అప్పిరెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు రాకేష్ పాల్గొన్నారు.

పాల సొసైటీల బలోపేతానికి చర్యలు

ప్రజాశక్తి-తిరువూరు: తిరువూరు క్లస్టర్ పరిధిలోని పెద్దవరం, వావిలాల పాల సొసైటీలకు చెందిన పాల రైతులతో కృష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు మంగళవారం సమావేశం నిర్వహించారు. పాడి రైతు సంక్షేమం- మన మతం కార్యక్రమం ద్వారా పాల సొసైటీలను మరింత బలోపేతం చేయడానికి అవసరమైన ప్రణాళికలు, చర్యలపై ఛైర్మన్ చర్చించారు. పాడి రైతుల సంక్షేమం కోసం కృష్ణా మిల్క్ యూనియన్ నిరంతరం పనిచేస్తుందని, పాడి రైతులు పాల అభివద్ధికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను, పాల గిట్టుబాటు రేటు రావడానికి ప్రత్యామ్నాయ మార్గాన్ని చలసాని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా డైరెక్టర్ బి. సుశీల, ట్రస్ట్ సభ్యులు పి.సత్యనారాయణ, సొసైటీల అధ్యక్షులు జి.వెంకటేశ్వరరావు, జి.అచ్చయ్య, మేనేజర్ మూర్తి పాల్గొన్నారు.



తాగునీటి పరీక్షలు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని ధర్మవరప్పాడు తండా గ్రామ పంచాయతీ పరిధిలో తాగునీటిని మంగళవారం పరిశీలించారు. నిర్ధారించిన పిహెచ్ విలువలకు అనుగుణంగా, ఫ్లోరైడ్ లేకుండా తాగడానికి అనుకూలంగా ఉన్నాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఇంజనీర్ సహాయకులు హరిబాబు నాయక్, పంచాయతీ కార్యదర్శి సైదా నాయక్, స్కూల్ ప్రధానోపాధ్యాయులు హనుమంతు నాయక్, హార్ట్ ఎన్జీవో ఐఎస్ఎ కో ఆర్డినేటర్ లక్ష్మి హారిక, లక్ష్మణ్ పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో ఏడుగురికి గాయాలు

ప్రజాశక్తి-వత్సవాయి: మండలంలోని భీమవరం గట్టు సమీపంలో గల రిలయన్స్ పెట్రోల్ బంకు సమీపంలో ట్యాంకర్‌ను కారు ఢీకొన్న సంఘటనలో ఏడుగురు గాయపడిన సంఘటన మంగళవారం జరిగింది. హైదరాబాదు నుండి గుడివాడ వెళ్తుండగా సేరి కల్వపురి గ్రామానికి చెందిన దివి శ్రీనివాసచారి, దివి శేషాచారి, వరలక్ష్మి, శ్రుతి, వాణి, రాజ్యలక్ష్మి, పెద్దరాజు, దినకర గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను జగ్గయ్యపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను, మాజీ ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ క్షతగాత్రులను పరామర్శించారు. మెరుగైన వైద్యం కోసం క్షతగాత్రులను విజయవాడ ఎన్‌ఆర్‌ఐ హాస్పిటల్‌కు తరలించారు.






సమస్యలు తెలుసుకుంటున్న కెవిపిఎస్ నాయకులు

ప్రజలపై భారాలు తగ్గించాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి-సింగ్‌నగర్

విజయవాడ 64వ డివిజన్ కండ్రికలోని ఎస్‌సి దళితపేటలో కెవిపిఎస్ బృందం మంగళవారం పర్యటించింది. దళితుల స్థితిగతులు, వారు ఎదుర్కొంటున్న సమస్యలపై నాయకులు సర్వే చేశారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి మాట్లాడుతూ దళితపేటలో ఎస్సీలకు ఇవ్వాల్సిన ఉచిత విద్యుత్‌ను నిలిపివేయడం తగదన్నారు. స్థానికంగా ఉన్న లగడపాటి రాజగోపాల్ కళ్యాణ మండపంలో ఫంక్షన్ల సమయంలో వాడుతున్న మురికినీటి వల్ల దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. దీని వల్ల దోమలు విపరీతంగా పెరిగి స్థానికులు అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఈ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదన్నారు. పనులు లేక ఇబ్బందులు పడుతున్న సామాన్య ప్రజలకు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు గుడిబండలాగా మారాయన్నారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. చెత్త, ఇంటి పన్నుల పేరుతో ప్రజలపై భారాలు మోపడం మానుకోవాలన్నారు. బలవంతపు వసూళ్లను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు చింతల శ్రీనివాస్, జి.అరుణ, సెంట్రల్ సిటీ నాయకులు రమణ, బాబ్జి, కె.సతీష్, ఎస్.త్రినాథ్, బి.దాసు పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో పేదలకు మెరుగైన వైద్యం : కలెక్టర్



ప్రజాశక్తి-విజయవాడఅర్బన్

గ్రామీణ ప్రాంతాల ప్రజల ఇంటి ముంగిటకే వైద్య సేవలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయడంలో జిల్లాను అగ్రగామిగా నిలపాలని కలెక్టర్ ఢిల్లీరావు వైద్యాధికారులకు సూచించారు. ఫ్యామిలీ డాక్టర్ సేవలు అమలుపై వైద్యాధికారులతో కలెక్టర్ గూగుల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అక్టోబర్ నెల నుండి ఫ్యామిలీ డాక్టర్స్ కాన్సెప్ట్ అమల్లోకి వచ్చిందన్నారు. జిల్లా వ్యాప్తంగా 23 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 239 వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌ల వైద్య బందాల ద్వారా ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు అందించేందుకు ప్రణాళికా బద్ధంగా ముందుకు వెళ్లాలన్నారు. గ్రామాల్లో పర్యటించి ప్రజలకు వైద్య పరీక్షలు, అవసరమైన మందులను ముందుగానే సిద్ధం చేసుకోవాలన్నారు. క్షయ, హెచ్ఐవి, కామెర్లు, మధుమేహం, రక్తపోటు, చెవి, ముక్కు, గొంతు వ్యాధులకు పరీక్షలు నిర్వహించి వైద్యసేవలు అందించడంతో పాటు కేసు వివరాలను నమోదు తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి ఎం. సుహాసిని, ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ మోతీబాబు, డిపిఎంఒ డాక్టర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రామిరెడ్డి శ్రీధర్‌కు అవార్డు



ప్రజాశక్తి-నందిగామ: నందిగామ పట్టణానికి చెందిన పర్యావరణ పరిరక్షణ సమితి అధ్యక్షులు రామిరెడ్డి శ్రీధర్‌కు 'ఆత్మ నిర్భర్ భారత వికాస్‌రత్న' అవార్డ్ లభించింది. న్యూఢిల్లీలో ఈ నెల 30వ తేదీన ఆలిండియా కాన్స్టిట్యూషనల్ క్లబ్ ఆవరణలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆల్ ఇండియా స్థాయిలో సెమినార్ నిర్వహించడం జరిగింది. ఈ సెమినార్‌లో దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి వివిధ రంగాలకు చెందిన 38 మందిని సన్మానించడం జరిగింది. ఎన్టిఆర్ జిల్లాలో పర్యావరణ పరిరక్షణ సమితి అధ్యక్షులుగా రెండు దశాబ్దాలకు పైగా సామాజిక సేవ చేస్తున్నందుకు ది ఎకానిమిక్ ఫర్ హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ సంస్థ వారు రామిరెడ్డి శ్రీధర్‌ను సత్కరించారు.

అప్పులతో రాష్ట్రం దివాళా : ఉమా

ప్రజాశక్తి-మైలవరం: పరిపాలన చేయడం చేతకాక వైఫల్యం చెంది, ఆరున్నర లక్షల కోట్లు అప్పు చేసి రాష్ట్రాన్ని సీఎం జగన్ దివాళా తీయించారని మాజీ మంత్రి, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు విమర్శించారు. సినీనటుడు తారకరత్న త్వరగా కోలుకోవాలని మంగళవారం నూజివీడు రోడ్డులోని పలు ఆలయాల్లో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాడేపల్లి ప్యాలెస్‌లో ముఖ్యమంత్రి అభద్రతా భావంలో ఉన్నారన్నారు. రాజధాని రైతులపై ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టడం దుర్మార్గమన్నారు. ఏ హక్కుతో విశాఖ రాజధాని అని చెబుతున్నారని ప్రశ్నించారు. బాబాయ్ హత్య కేసులో నిందితులను కాపాడడానికి ఢిల్లీలో పైరవీలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు పాల్గొన్నారు.

5న ఆర్ట్ కాంటెస్ట్, ఎగ్జిబిషన్

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: చిన్నారుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి వారిలో దేశభక్తిని పెంపొందించాలనే ముఖ్య ఉద్దేశంతో స్ఫూర్తి క్రియేటివ్ ఆర్ట్ స్కూల్ ఆధ్వర్యంలో ఈ నెల 5న సలాం ఇండియా ఆర్ట్ కాంటెస్ట్, ఆర్ట్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు ఆర్ట్ స్కూల్ డైరెక్టర్ స్ఫూర్తి శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం గాయత్రీనగర్‌లోని స్ఫూర్తి ఆర్ట్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కెబిఎన్ కళాశాలలో ఉదయం పది గంటలకు ఆర్ట్ ఎగ్జిబిషన్, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు చిత్రలేఖన పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్, ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు, జ్ఞాపికలు అందజేస్తామని చెప్పారు. కాంటెస్ట్‌లో పాల్గొనదలచిన విద్యార్థులు 7981435393 నెంబర్‌కి వాట్సాప్ ద్వారా, salaamindiaartcontest@gmail.com ఈమెయిల్ ద్వారా, www.spoorthicreativeartschool.com గూగుల్ లింక్ ద్వారా గానీ పంపించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

ఓబన్న పోరాట స్ఫూర్తి మరువలేనిది : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కంచికచర్ల: స్వాతంత్ర సంగ్రామంలో వడ్డే ఓబన్న పోరాటం వీరోచితమని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్‌రావు అన్నారు. స్థానిక ఇందిరా కాలనీలో ఏర్పాటు చేసిన వడ్డే ఓబన్న విగ్రహాన్ని మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ ప్రభుత్వ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసిన యోధుడు వడ్డే ఓబన్న అని కొనియాడారు. స్వాతంత్ర పోరాటంలో రేనాటి ప్రాంతంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి అంగరక్షకుడుగా, సైన్యాధ్యక్షుడుగా ఓబన్న వీరోచిత పోరాటం చేశారన్నారు. ఓబన్న పోరాట స్ఫూర్తిని భావితరాలకు చాటి చెప్పాలని పిలుపునిచ్చారు. ఆయన విగ్రహ ఏర్పాటుకు చొరవచూపిన అచ్చి పెదబాబును అభినందించారు. ఓబన్న విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వడ్డే ఓబన్న మనవడు నరసింహుడు, గుంటూరు మిర్చి యార్డ్ ఛైర్మన్ చంద్రగిరి



ఏసురత్నం, వడ్డెర కుల సంఘం నాయకులు అచ్చి చినబాబు, బేబీ రాణి, తన్నీరు ఆంజనేయులు, గ్రామ సర్పంచ్ వేల్పుల సునీత శ్రీనివాసరావు, జడ్పిటిసి వేల్పుల ప్రశాంతి, సొసైటీ అధ్యక్షులు కాలవ పెదబాబు, మండల టిడిపి అధ్యక్షుడు కోగంటి బాబు తదితరులు పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-నందిగామ: పట్టణంలోని 18వ వార్డులో జీసస్ క్రాస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య శిబిరం ఏర్పాటు చేసిన కొండూరు బాబురావును అభినందించారు. అనంతరం ఎమ్మెల్సీని సొసైటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ మహమ్మద్ మస్తాన్, వార్డు కౌన్సిలర్ బండారు గంగమ్మ శేషు, నాయకులు యార్లగడ్డ సత్యనారాయణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు .

పాతపాడుకు పందుల తరలింపు

ప్రజాశక్తి-విజయవాడరూరల్: విజయవాడ నగరంలోని పందులను పాతపాడు గ్రామానికి తరలించనున్నారు. ఈ మేరకు కార్పొరేషన్ అధికారులు చర్యలు చేపట్టారు. పాతపాడులో ఆర్ఎస్ నెంబర్ 75/5లో 53 మంది పందుల పెంపకందార్లకు 2.10 ఎకరాల భూమిని కేటాయించారు. అందులో షెడ్డు నిర్మాణం, మౌలిక సదుపాయాలు కూడా కార్పొరేషన్ కల్పించనుంది. ఈ విషయంపై కార్పొరేషన్ అధికారులు పంచాయతీని సంప్రదించలేదని సర్పంచ్ డి.సుజాత అన్నారు. పందులు గ్రామానికి వస్తే ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉందని తెలిపారు.

జల్ జీవన్ మిషన్ పనుల పరిశీలన

ప్రజాశక్తి-రెడ్డిగూడెం: మండల కేంద్రంలో ఎస్సీ ఏరియాలో జల్ జీవన్ మిషన్ ద్వారా మంచినీటి పైపులైన్లు సౌకర్యం కోసం జరుగుతున్న పనులను మండల పరిషత్ ఉపాధ్యక్షుడు చాట్ల రాబర్ట్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడ్డిగూడెం శివారు రాఘవపురం ఎస్సీ ఏరియాలో రూ.54 లక్షల వ్యయంతో జలజీవన్ మిషన్ పనులను ప్రారంభించడం జరుగుతుందని, పైప్‌లైన్ ద్వారా మంచినీటి వసతి కల్పించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

ప్రజాశక్తి-తిరువూరు: మండలంలో యూరియా కొరతలేదని, 130.37 మెట్రిక్ టన్నులు నిల్వ వుందని, రైతులు అధిక ధర్లకు కొనుగోలు చేయవద్దని వ్యవసాయ అధికారిణి పద్మ తెలిపారు. పట్టణంలోని పలు ఎరువుల షాప్‌లను ఆమె మంగళవారం తనిఖీ చేశారు. రిటైల్ డీలర్ల వద్ద 130.37 మెట్రిక్ టన్నులు, ఆర్‌బికెలలో 20 టన్నుల యూరియా అందుబాటులో ఉందని చెప్పారు. 45 కిలోల యూరియా ధర రూ.266.5 మాత్రమే అని, ఇంతకు మించి ఎక్కువ విక్రయిస్తే అటువంటి డీలర్ పై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పాతపెన్షన్ విధానాన్నే కొనసాగించాలి : యుటిఎఫ్


అవనిగడ్డలో


ఉయ్యూరులో

ప్రజాశక్తి-అవనిగడ్డ

సామాజిక ఆర్థిక భద్రతలేని సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి ఓపిఎస్‌ను పునరుద్ధరించాలని ఈ నెల మూడోతేదీన గన్నవరం సమీపంలోని సుందరయ్య విద్యానగర్‌లోని ధర్మస్థలిలో జరగబోవు సంకల్ప దీక్షను జయప్రదం చేయాలని యుటిఎఫ్ కృష్ణాజిల్లా అధ్యక్షులు బి.కనకారావు పిలుపునిచ్చారు. అవనిగడ్డలోని సంఘ కార్యాలయం వద్ద సంకల్ప దీక్షకు సంబంధించిన పోస్టర్లను మంగళవారంనాడు నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కనకారావు మాట్లాడుతూ నేటి ముఖ్యమంత్రి ఆనాడు ప్రతిపక్ష నేతగా తమ ప్రభుత్వం ఏర్పాటు కాగానే వారం రోజుల్లో సిపిఎస్‌ను రద్దు చేస్తామని చెప్పిన మాటలు మూడు సంవత్సరాల ఎనిమిది నెలలు గడిచినప్పటికీ నెరవేరలేదన్నారు. మొదటి నుంచి పశ్చిమబెంగాల్ ఓపి ఎస్ ను అమలు చేస్తూ ఉండగా ఇటీవల కాలంలో రాజస్థాన్, చత్తీష్‌ఘడ్, పంజాబ్, జార్ఖండ్ రాష్ట్రాలు ఒపిఎస్‌ను అమలు చేయటానికి ఆయా అసెంబ్లీల్లో తీర్మానాలు కూడా చేశాయని గుర్తుచేశారు. కొత్తగా ఏర్పడిన హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వం కూడా సిపిఎస్‌ను రద్దుచేసి ఓపిఎస్ అమలు దశగా అడుగులు వేసిందన్నారు. పొరుగు రాష్ట్రమైన తమిళనాడులో ఏప్రిల్ నుంచి ఒపిఎస్ అమలు కోసం ప్రయత్నాలు ప్రారంభించిందని తెలిపారు. ఈ సమావేశానికి అవనిగడ్డ మండల శాఖ అధ్యక్షులు జీవేంద్రరావు అధ్యక్షత వహించారు. ప్రధాన కార్యదర్శి ఎన్.శ్రీకాంత్, సభాధ్యక్షులు ఎన్ ఆర్ కే వి ప్రసాద్, కోశాధికారి బి శివరామకృష్ణ, ఎస్.శ్రీనివాసరావు, వై.శోభన్‌బాబు, వి.బుజ్జిబాబు, సంఘ సభ్యులు పాల్గొన్నారు. **ఉయ్యూరు** :సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్‌ను కొనసాగించాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లెనిన్‌బాబు రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. ఉయ్యూరు శ్రామికభవనంలో సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలనీ, పాత పెన్షన్‌ను కొనసాగించాలని కోరుతూ ఈనెల మూడోతేదీన గన్నవరం సమీపంలోని సుందరయ్య విద్యానగర్‌లోని ధర్మస్థలిలో జరగబోవు సంకల్ప దీక్షను విజయవంతం చేయాలని కోరుతూ రూపొందించిన వాల్‌పోస్టర్లను మంగళవారం యుటిఎఫ్ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లెనిన్‌బాబు మాట్లాడుతూ 2004లో పిఎఫ్‌ఆర్‌డిఎ చట్టం ద్వారా అమల్లోకి తెచ్చిన సిపిఎస్ విధానం ఉద్యోగుల భద్రతను కాలరాస్తోందన్నారు. సిపిఎస్ విధానం రద్దుచేయాలనీ, పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలనీ గత ప్రభుత్వ హయాంలో స్వతంత్ర్యంగాను, ఉమ్మిడి వేదికలపైన అనేక పోరాటాలు చేశామన్నారు. సిపిఎస్, జిపిఎస్ ఏదైనా ఉద్యోగులు, ఉపాధ్యాయులతోపాటు ప్రభుత్వానికి లాభం ఉండబోదని గణాంకాలు చెబుతున్నాయన్నారు. అయినా ప్రభుత్వం పెడచెవిన పెడుతోందన్నారు. కార్పొరేట్లకు మాత్రమే లాభాన్ని చేకూర్చే కంట్రిబ్యూటరీ పెన్షన్‌ను రద్దుచేయాలని డిమాండ్‌చేశారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి అబ్దుల్ హమీద్, రాష్ట్ర కౌన్సిలర్ రామారావు, కంకిపాడు, పెనమలూరు, ఉయ్యూరు, పమిడిముక్కల, తోట్లవల్లూరు, పామర్రు సబ్ కమిటీ సభ్యులు హాజరయ్యారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి-చల్లపల్లి

ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని చల్లపల్లి ఎస్ఐ చినబాబు కోరారు. చల్లపల్లి బందరురోడ్డులోని ఎ న్ ఆ ర్ వై ఎ న్ వి జూనియర్ కళాశాల సెంటర్లో మంగళవారం వా హ న దా రు ల తో ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణహాని లేకుండా బయట పడగలుగుతారని సూచించారు. అతివేగంగా వాహనాలు నడపడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. పోలీసుల సూచనలను పాటించి ట్రాఫిక్ నిబంధనలను పాటించాలన్నారు.


మాట్లాడుతున్న ఎస్ఐ చినబాబు

సత్యనారాయణస్వామి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు

స్థానిక సంత రోడ్డులోని శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి 71 బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, 10 గంటలకు శ్రీవారిని పెళ్లికుమారుడిని చేశారు. సాయంత్రం 6 గంటలకు అంకురార్పణ, ధ్వజారోహణం కార్యక్రమాలను పొట్లూరి సత్యనారాయణ జ్యోతి దంపతులు నిర్వహించారు. బుధవారం తెల్లవారుజామున సత్యనారాయణ స్వామి వ్రతాలను ఘనంగా నిర్వహించబడతాయని నిర్వాహకులు తెలిపారు.

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ : గీతాబాయి

ప్రజాశక్తి కోడూరు

దూర ప్రాంతంలోని గర్భిణీ స్త్రీల పట్ల వైద్య, ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డిఎంహెచ్ఓ డాక్టర్ గీతా బాయ్ కోరారు. కోడూరు మండల పరిధిలోని మందపాకల గ్రామంలోని


మాట్లాడుతున్న గీతాభాయి

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు హై రిస్క్ ప్రెగ్నెంట్ కేసులు హాస్పటల్‌కు ట్రాకింగ్ చేయాలని దూర ప్రాంతంలో ఉన్న గర్భిణీ స్త్రీలకు ట్యాగ్ లింక్ చేసి సేవలు అందించాలన్నారు. ప్రతి పాఠశాలను సందర్శించి విద్యార్థులకు రక్తహీనత పరీక్షలు చేయాలన్నారు. ఏఎన్సిపి కార్డులు, హాస్పిటల్ రికార్డ్స్ ఓపి వివరాలు తనిఖీ చేసి సంతృప్తిని వ్యక్తంచేశారు. హాస్పిటల్ ప్రాంగణంలో మొక్కలు నాటి ఆహ్లాదకరంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో మందపాకల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని నవషి, సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నజీర్‌భాష

గృహ సారధులను నియమించాలి : నజీర్‌బాష

ప్రజాశక్తి-అవనిగడ్డ

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను మరింత సమర్ధవంతంగా అమలు చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు గృహసారథుల నియామక ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆ పార్టీ అవనిగడ్డ మండల సచివాలయాల కన్వీనర్ షేక్ నజీర్ భాష పిలుపునిచ్చారు. వాలంటీర్లు సచివాలయం కన్వీనర్లతో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే రమేష్ బాబు, కడవకొల్లు నరసింహారావు సూచనలతో ప్రతి 50 కుటుంబాలకు ఇద్దరు గృహసారథులను నియమించాలన్నారు. వారు ప్రభుత్వానికి పార్టీకి వారధిగా పనిచేసే మళ్లీ పార్టీని బలోపేతం చేసి తిరిగి అధికారంలోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, లంకమ్మ అమ్మవారి దేవస్థానం చైర్మన్ చింతలపూడి బాలు, మూడో సచివాలయం కన్వీనర్లు షేక్ ఖాదర్ వలీ, ఎం.ఫణి, బి.అనూష, సచివాలయం సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

శ్మశానవాటికకు స్థలం కేటాయించాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - గుడివాడ (నందివాడ)

గ్రామస్తులు కోరిక మేరకు శ్మశాన వాటికకు స్థలం కేటాయించాల్సిందిగా గుడివాడ రెవెన్యూ డివిజన్ అధికారిణి పి.పద్మావతి డిప్యూటీ తహశీల్దార్‌ను ఆదేశించారు. నందివాడ మండలం వెంకటరాఘవాపురం గ్రామదర్శిని కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీవో గ్రామ పంచాయతీ రికార్డులు, అంగన్వాడీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిశీలించారు. గ్రామ పంచాయతీ సర్పంచ్ కాకరాల సుభాష్ చంద్రబోస్, ఎంపిడిఒ బి.వై.విష్ణుప్రసాద్, డిప్యూటీ తహశీల్దారు మల్లిక,ఐసిడిఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి వి.వినోద్ కుమార్, వెలుగు ఎపిఎంహెచ్.ప్రధానరావు, సచివాలయ, రెవెన్యూ సిబ్బంది,వాలంటీర్లు పాల్గొన్నారు.


సమస్యలు తెలుసుకుంటున్న ఆర్‌డిఒ పద్మావతి

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-అవనిగడ్డ


వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

మండల పరిధిలోని రామకోటిపురం గ్రామంలో విజయవాడ హెల్ప్ హాస్పటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 100 మందికి పైగా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. పదిమందిని విజయవాడ వైద్యశాలకు రిఫర్ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వైద్యులు సిబ్బందికి భోజన వసతులు కల్పించడంతోపాటు వైద్యులను దుశ్శాలువాలతో సత్కరించి అభినందించారు.

రికార్డులు సక్రమంగా ఉండాలి

కృష్ణాజిల్లా కో ఆపరేటివ్ అధికారి ఫణికుమార్

ప్రజాశక్తి-గుడివాడ

రికార్డులు సక్రమంగా లేకపోతే చర్యలు తీసుకుంటానని కృష్ణాజిల్లా కోపరేటివ్ అధికారి వి.వి.వి.ఫణి కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం గుడివాడ రూరల్ మండలం వలివర్తిపాడు గ్రామంలో గ్రామదర్శిని


అధికారులతో మాట్లాడుతున్న డిసిఒ

కార్యక్రమంలో భాగంగా గ్రామపంచాయతీ రికార్డులు, అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాల సదుపాయాలు, పబ్లిక్ వాటర్ సప్లై, శానిటేషన్ నిర్వహణ, జగనన్న హౌసింగ్ లే-అవుట్ పనులు తదితర అంశాలను సిబ్బంది సమక్షంలో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రత్యేక అధికారి, ఈఓపిఆర్డీ డి.వెంకటేశ్వరరావు, పిఏసిఎస్ బ్యాంక్ ప్రెసిడెంట్ చింత శ్రీను, మాజీ సర్పంచ్ శాయిన నాగబాబు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ అరుణ కుమారి, పంచాయతీ కార్యదర్శి కె.అనుల, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మహిళా పోలీస్‌లు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-చల్లపల్లి

మహిళా పోలీసులు గ్రామీణ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సమస్యలను గుర్తించి ఆయా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని చల్లపల్లి ఎస్ఐ చినబాబు అన్నారు. చల్లపల్లి పోలీస్ స్టేషన్‌లో మంగళవారం మండలంలోని మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. మండలంలో గ్రామాల వారీగా నెలకొని ఉన్న పరిస్థితులను అడిగి తెలుసుకొన్నారు. సమసాత్మక గ్రామాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో ఎక్కడైనా ఎలాంటి సమస్య ఎదురైనా తక్షణమే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు కాపుసారా మత్తు పదార్థాలు తదితర అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తుంటే వెంటనే సమాచారం అందించాలన్నారు. నిరంతరం ఆయా గ్రామాలపై మహిళా పోలీసుల పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. ఈ సమావేశంలో మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-కంచికచర్ల: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని పరిటాల సమీపంలో గల అమ్రితసాయి ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విజయవాడ ఆంధ్ర హాస్పటల్, అమ్రితసాయి కళాశాల యన్‌యస్‌యస్ యూనిట్ సంయుక్త సహకారంతో ఆంధ్ర హాస్పటల్ వైద్యులు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యులు డాక్టర్ అచ్యుత్ బాబు, డాక్టర్ వినీల తదితరులు బీపీ , షుగర్, గుండెకు సంబంధించిన వ్యాధులపై వైద్య పరీక్షలు నిర్వహించి, సమస్యలు ఉన్న వారికి మెరుగైన వైద్యం కోసం సలహాలు ఇచ్చారు. శిబిరాన్ని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ జెండర్ డాక్టర్ పుల్లగూర ప్రభాకరరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు సూదుల సోమశేఖర్, కోనేటి శ్రీను పాల్గొన్నారు



రాజ్యాంగ స్ఫూర్తిని విస్మరిస్తున్న ప్రభుత్వాలు

రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు

ప్రజాశక్తి-విజయవాడ: నగరాల్లో, పట్టణాల్లో దుర్భరమైన జీవితాలను అనుభవిస్తున్న సఫాయి కర్మచారుల కుటుంబాలకు అండగా నిలుస్తామని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు చెప్పారు. స్థానిక ఎంబివికె భవన్‌లో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కర్మచారి సమ్మేళనం జరిగింది. దీనికి డిబిఆర్‌సి రాష్ట్ర కార్యదర్శి అల్లడి దేవకుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ రాజ్యాంగ స్ఫూర్తిని ప్రభుత్వాలు, సమాజము విస్మరించడమే సఫాయి కర్మచారుల ప్రస్తుత స్థితిగతులకు కారణమన్నారు. రాష్ట్ర సమాచార కమిషనర్ పి శామ్యూల్ జునాథన్ మాట్లాడుతూ అణచివేయబడ్డ వర్గాల సంక్షేమం సామాజిక, ప్రాథమిక బాధ్యత అని అన్నారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ... రాష్ట్రంలోనే మొదటి సారిగా తన నియోజకవర్గంలో నివశిస్తున్న 100 మంది వేస్ట్ పిక్కర్లకు సబ్‌ప్లాన్ నిధుల నుంచి ప్రత్యేక బడ్జెట్ కేటాయించి ఇళ్లను నిర్మించి ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో డిసిపి నూకా సత్యబాబు, జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి ఎం రుక్మందయ్య, డిబిఆర్‌సి అర్బన్ ప్రోగ్రామ్ మేనేజర్ చుక్కా శామ్యూల్, అనిల్‌కుమార్, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ బి రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎంలో మౌంట్‌ఫోర్ట్ జయంతి

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: పటమటలోని ఎన్‌ఎస్‌ఎం పబ్లిక్ స్కూల్‌లో మంగళవారం పునీత మౌంట్‌ఫోర్ట్ 350వ జయంతి వేడుకలు పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ బ్రదర్ రాయప్ప మౌంట్‌ఫోర్ట్ జీవితచరిత్రను, సామాజిక సేవ గురించి తెలిపారు. మౌంట్‌ఫోర్ట్ స్థాపించిన విద్యాసంస్థలకు సంబంధించిన ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమానికి విజయవాడ కతోలిక గురుపీఠం బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మౌంట్‌ఫోర్ట్ ఎన్నో విద్యా సంస్థలు స్థాపించి కంతో మందికి చక్కటి విద్యను అందించారని అలాగే సామాజిక సేవా కార్యక్రమాలను కూడా నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ బ్రదర్ మాంటి, వైస్ ప్రిన్సిపాల్ బ్రదర్ బాలారెడ్డి పాల్గొన్నారు.



చుండూరు వెంకటరెడ్డికి నివాళి

ప్రజాశక్తి-వన్‌టౌన్: శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానంకు ఉప సంస్థ అయిన సి.వి.రెడ్డి చారిటీస్ వ్యవస్థాపకులు చుండూరు వెంకటరెడ్డి 42వ వర్ధంతి కార్యక్రమం వన్‌టౌన్‌లోని సివి రెడ్డి చారిటీస్‌లో మంగళవారం జరిగింది. దుర్గగుడి ఇఒ చుండూరు వెంకటరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ వేద విద్యార్థులకు, పేద విద్యార్థులకు స్కాలర్ షిప్పులు మరియు అమ్మవారి ప్రసాదం అందజేశారు. మహిళలకు చీరలు పంపిణీ చేశారు. 500 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప కార్యనిర్వాహక ఇంజనీర్లు కె.వి.ఎస్. కోటేశ్వరరావు, ఎల్.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు 'మత్తు'కు దూరంగా ఉండాలి : సిఐ



ప్రజాశక్తి-భవానీపురం: మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల బారిన పడకుండా విద్యార్థినీ విద్యార్థులు దూరంగా ఉండాలని భవానీపురం పోలీస్‌స్టేషన్ సిఐ ఎం.డి. ఉమర్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం భవానీపురం పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో మానవ మందిరం రోడ్డులో గల నారాయణ జూనియర్ కాలేజీలో మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిఐ ఎం.డి. ఉమర్ పాల్గొని మాట్లాడుతూ గంజాయి లేదా ఏ విధమైన మాదక ద్రవ్యాలు అమ్ముతున్నా లేదా విజయవాడ సిటీలో మాదక ద్రవ్యాలు అక్రమ రవాణా చేస్తున్నా పోలీసు వారికి తెలియజేయాలని కోరారు. విద్యార్థినీ విద్యార్థులకు కాలేజీ దశ జీవితానికి ఎంతో కీలకమని, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. కాలేజీ విద్యార్థినీ విద్యార్థుల్లో చైతన్యం రావడానికి ఇలాంటి సదస్సులు నిర్వహిస్తున్నామని, మీరంతా సహకరిస్తే ఎంతోమంది కుటుంబాలలో వెలుగు నింపిన వారు అవుతారని తెలిపారు. అలాగే హెల్మెట్ ధరించి వాహన నడపాలని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపరాదని, నిర్లక్ష్యపు డ్రైవింగ్ వల్ల మీ కుటుంబాలు రోడ్డున పడతాయని విద్యార్థినీ విద్యార్థులు అంతా సహకరిస్తే మీ కుటుంబాలు బాగుంటాయని సిఐ ఉమర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రైమ్ ఎస్‌ఐ సత్యనారాయణ, ఎస్‌ఐ రామారావు, నారాయణ కాలేజీ ప్రిన్సిపల్ జనార్ధన్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుండి ఉరుసు మహోత్సవాలు

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: కొండపల్లి మున్సిపాలిటీలో అతి పురాతన దర్గా అయిన హజరత్ సయ్యద్ షాబుఖారి బాబా 426వ ఉరుసు మహోత్సవాలు ప్రారంభంకానున్నాయి. మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించే ఉరుసు మహెూత్సవానికి దాదాపుగా ఏర్పాట్లు పూర్తి చేశారు. కొండపల్లి బి కాలనీ సెంటర్ నుండి విటిపియస్ ప్రహరీ గోడ లోపల ఉన్న దర్గా వరకు ప్రాంగణం వరకు విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. ఉరుసులో కులమతాలకతీతంగా లక్షల సంఖ్యలో యాత్రికులు పాల్గొం టారని దర్గా నిర్వహకులు తెలిపారు. ఉరుసు నిర్వహించే 3రోజుల పాటు షాబుఖారి నిత్య అన్నదాన లంగర్ ఖానా ద్వారా వచ్చే యాత్రికుల కోసం ప్రత్యేకంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాట్లు చేసినట్లు అల్తాప్‌బాబా తెలియజేశారు. మంగళవారం గుసుల్ తో ప్రారంభమయ్యే ఉరుసు మహెూత్సవాలు గురువారం చిరాగాతో ముగుస్తాయి. పిబ్రవరి1 బుధవారం జరిగే ఉరుసు ప్రత్యేకమైనది. రైల్వేస్టేషన్ వద్ద నుండి గంధం మేళాతాళాలతో భారీ గుర్రబండ్లతో ఊరేగింపుగా బయలుదేరి తెల్లవారుజామున దర్గాకు చేరుతుంది. షాబుఖారి ఆస్థాన పీఠాధిపతులు అల్తాప్‌బాబా మాట్లాడుతూ దర్గాకు వచ్చే యాత్రికులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా పూర్తి ఏర్పాట్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉరుసు మహెూత్సవానికి దేశ నలుమూలల నుండి యాత్రికులు వస్తారని రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీ నాయకులతో పాటుగా వివిధ ప్రముఖులు హజరవుతారని తెలిపారు. మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే షాబుఖారి దర్గాకు కులమతాలకు అతీతంగా యాత్రికులు వస్తారని తెలిపారు.





మేరిమాత నవదిన ప్రార్థనలు ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: గుణదల మేరిమాత మహోత్సవాల్లో భాగంగా నవదిన ప్రార్థనలు మంగళవారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. విజయవాడ కేథలిక్ డయోసిస్ బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు, మోన్సిగ్నోర్ మువ్వల ప్రసాద్, వికార్ జనరల్ యం.గాబ్రియేలు , గుణదల మాత పుణ్యక్షేత్రం రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు, మరియమాత పతాకాన్ని ఆవిష్కరించి ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం బిషప్ జోసఫ్ రాజారావు మాట్లాడుతూ 1923లో గుణదల కొండపై గుణదల మాత మహెూత్సవాలు ప్రారంభమయ్యాయయని తెలిపారు. ఈ సంవత్సరం 99వ గుణదల మాత మహోత్సవాలు జరుగుతున్నాయన్నారు. వచ్చే సంవత్సరం శతాబ్ది మహక్షత్సవాలు జరుపుకోవడానికి ఇప్పటి నుండే ప్రణాళికలు రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఫాదర్లు, విచారణ గురువులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం ఏర్పాటు

ప్రజాశక్తి-గంపలగూడెం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు విరాళాలతో మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేసినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ కేతినేని వెంకటేశ్వరరావు తెలిపారు. గంపలగూడెంలో ప్రధాన రహదారి అందుగల వివిధ వ్యాపారస్తులు, దాతత్వం కలిగిన వారి వద్ద నుండి అధ్యాపకుల సహాయంతో విరాళాలు సేకరించినట్లు తెలిపారు. ఈ విధంగా మధ్యాహ్నం భోజనం పెట్టడంతో విద్యార్థులు సమీపిస్తున్న వేసవి సమయంలో ఇబ్బంది పడకుండా ఉంటారని తెలిపారు. అదే విధంగా విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఇదో అవకాశం అని వివరించారు. దాతత్వం కలిగిన దాతలు ముందుకు రావాలని ప్రిన్సిపాల్ కోరారు.

పాఠశాల తనిఖీ

ప్రజాశక్తి-గంపలగూడెం: మంగళవారం నాడు వార్షిక తనిఖీల్లో భాగంగా స్థానికంగా ఉన్న వనమారెడ్డి గూడెం తోటమూల)లో గల ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసినట్లు ఎంఈఓ బి సోమశేఖర్ నాయక్ తెలిపారు. పాఠశాలలో మధ్యాహ్నం భోజనం, పిల్లల విద్యాబుద్ధుల తీరు, అధ్యాపకుల పనితీరు, తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించినట్లు సోమశేఖర్ వివరించారు. ఈ కార్యక్రమంలో రేగళ్ల అంజిరెడ్డి, ఇసాక్ లు విద్యార్థులు పాల్గొన్నారు.

బత్తిన రామ్మోహన్‌రావు వర్ధంతి

ప్రజాశక్తి-సింగ్‌నగర్: 59వ డివిజన్ సిపిఎం సీనియర్ నాయకులు బత్తిన రామ్మోహన్‌రావు 8వ వర్ధంతి సభ ఏకలవ్య నగర్‌లో మంగళవారం జరిగింది. రాము చిత్రపటానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగ్‌నగర్ ప్రాంతంలో దశాబ్దాల కాలం పాటు రాము సిపిఎం నాయకునిగా పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశారని అన్నారు. ఇళ్లపట్టాలు ఇప్పించడంలో ఎనలేని కషి చేశారని గుర్తు చేశారు. వయోజన పాఠశాల పెట్టి చదువు లేని వారికి చదువు నేర్పించారన్నారు. బుడమేరు వరదలు వచ్చిన సందర్భాలలో సహాయ కార్యక్రమాలు చేసేదాంట్లో ముందుండే వారని తెలిపారు. పేదలు నివసిస్తున్న ఈ ప్రాంతంలో లీలా సుందరయ్య పేరిట గ్రంథాలయం నిర్మించుటలో కీలక పాత్ర పోషించారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సెంట్రల్ సిటీ కార్యదర్శి బి.రమణారావు, నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె దుర్గారావు, డివిజన్ నాయకులు యం నాగార్జున, కె కష్ణమురారి, రసూల్, రషీద్, మంగపతి, మూర్తి తదితరులు పాల్గొన్నారు.





42వ డివిజన్‌లో 'ఇదేం ఖర్మ'

ప్రజాశక్తి-భవానీపురం: రాష్ట్రంలో జగన్ పాలన దారుణంగా వుందని టిడిపి ఎన్టీఆర్ జిల్లా మీడియా కోఆర్డినేటర్ , మాజీ కార్పొరేటర్ యేదుపాటి రామయ్య విమర్శించారు. మంగళవారం ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం 42వ డివిజన్ భవానీపురంలోని ప్రియదర్శిని కాలనీలో ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ ఇంటింటికి వెళ్లి ప్రస్తుత ప్రభుత్వం చేస్తున్నటువంటి నియంతపాలన ప్రజలకు తెలియజేస్తూ వారి అభిప్రాయాలు సేకరించి పార్టీ కార్యాలయనికి పంపించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి అందే మేరీ, యూనిట్ ఇన్‌చార్జ్ స్రవంతి పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని అనుమంచిపల్లి గ్రామంలో ఎస్సీ ఏరియా నుంచి బలుసుపాడు రోడ్డు వరకు కోటి రూపాయలతో రెండు కిలోమీటర్ల వరకు నిధులు మంజూరు చేశారు. ఈ తారు రోడ్డు పనులను సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్ తో కలిసి మాజీ ఎంపిపి మాతంగి వెంకటేశ్వర్లు మరియు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు పరిశీలించారు. ఉదయభాను ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారనీ, ఈ రోడ్డు ద్వారా ప్రభుత్వ భూములకు, ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులకు మార్గం కల్పించారని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.



వాహనదారులకు అవగాహన

ప్రజాశక్తి-గంపలగూడెం

పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం గంపలగూడెం ఎస్సై వి సతీష్ కుమార్ స్పెషల్ డ్రైవ్ తన సిబ్బందితో నిర్వహించారు. అందులో భాగంగా గంపలగూడెం, తోట మూల గ్రామాల్లో ప్రధాన రహదారి యందు వాహనాల తనిఖీలపై నిగాపెట్టారు. అధికలోడుతో వస్తున్న వాహనదారులకు అందులో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు, క్లాస్ తీసుకున్నారు. ఆ విధంగా ప్రయాణం చేస్తే ఎదురయ్యే సమస్యలను వివరించారు. ప్రయాణ సమయంలో ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ విధిగా వాడాలని తెలిపారు. అదేవిధంగా వాహనదారుల వద్ద ఏర్పడ్డ వివిధ లోపాలకు గాను అపరాధ రుసుము విధించారు.

మహిళల భద్రతపై అవగాహన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని షేర్ మహమ్మద్ పేట, చిళ్ళకల్లు గ్రామాల్లో మంగళవారం రాత్రి చిల్లకల్లు పోలీస్ వారి ఆధ్వర్యంలో చేరువ ప్రోగ్రాం మహిళల భద్రత కోసం అవగాహన కార్యక్రమం చిల్లకల్లు ఎస్ ఐ దుర్గా ప్రసాద్, దిశ ఉమెన్ ఎస్సై నారాయణమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డిజిటల్ వీడియో ప్రోగ్రాం ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ శ్రీనివాసరావు, కానిస్టేబుల్ సునీల్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సందడిగా గన్నవరం బాలోత్సవం

గన్నవరం బాలికల ఉన్నత పాఠశాలలో కాట్రగడ్డ రవీంద్ర వేదికపై గన్నవరం బాలోత్సవం వేడుకలు అత్యంత ఉత్సాహంగా జరిగాయి. మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ప్రారంభ సభలో ప్రసాద్ మాట్లాడారు. విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. పెద్దఎత్తున వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.













పిల్లల్లో సృజనాత్మకత వెలికితీతకు దోహదం


బాలోత్సవం వేడుకల ప్రారంభ సభలో తానా మాజీ అధ్యక్షులు టిబిఆర్ ప్రసాద్

ప్రజాశక్తి-గన్నవరం

ప్రతి పిల్లవాడిలో ఏదో ఒక మేథో శక్తి ఉంటుందని, దానిని బయట పెట్టేందుకు పోటీలు ఎంతగానో దోహదపడతాయని తానా మాజీ అధ్యక్షులు టిబిఆర్ ప్రసాద్ అన్నారు. గన్నవరం బాలికల ఉన్నత పాఠశాలలో కాట్రగడ్డ రవీంద్ర వేదికపై గన్నవరం బాలోత్సవం వేడుకలు అత్యంత ఉత్సాహంగా జరిగాయి. మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ప్రారంభ సభలో ప్రసాద్ మాట్లాడారు. బాల బాలికలు చదువుతో పాటు సాంస్కృతిక, క్రీడా రంగాల్లోనూ రాణించాలని కోరారు. పుట్టిన ఊరు, చదివిన పాఠశాల, కన్న తల్లిదండ్రులు, పీల్చిన గాలి, తాగిన నీరు ఇవన్నీ చాలా ముఖ్యమన్న విషయాన్ని ఎప్పటికీ మర్చిపోకూడదని పిల్లలకు సూచించారు. జీవితంలో ఉన్నత స్థాయికి వెళ్లిన తర్వాత చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తమ వంతు చేయూత అందించాలన్నారు. తాను ఈరోజు తానా స్థాయి వరకు వెళ్లానంటే బాలుర ఉన్నత పాఠశాల, వేములపల్లి కోదండ రామయ్య కళాశాల పెట్టిన విద్య బిక్ష అని గుర్తుచేశారు. మహనీయులు పుచ్చలపల్లి సుందరయ్య, డాక్టర్ సి ఎల్ రాయుడు, వెలివెల సీతారామయ్య నడచిన గడ్డ గన్నవరం అని గుర్తుచేశారు. పిల్లల్లో దాగున్న సృజనాత్మక శక్తిని బయటకు తీయడానికి బాలోత్సవం సాంస్కృతిక వేదికలను నిర్వహిస్తూ కృషిచేస్తోన్న కమిటీని ప్రత్యేకంగా అభినందించారు. మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ బాలోత్సవ వేడుకలు మూడేళ్ల క్రితం నుంచి జరపాలని ప్రయత్నం చేస్తున్నామన్నారు. అది ఇప్పటికీ నెరవేరిందని సంతోషం వ్యక్తం చేశారు. 15 రోజుల వ్యవధిలో ఈ వేడుకలకు సన్నాహాలు చేశామన్నారు. విద్యావంతులు, మేధావులు, ఉపాధ్యాయుల నుంచి ఊహించని రీతిలో స్పందన రావడంతో వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహించే అవకాశం కల్గిందన్నారు. వేడుకలకు వేదిక ఇచ్చిన బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం అనితకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. పిల్లలే ఈ దేశానికి సంపద అని, వారిని మెరికల్లా తయారు చేయడానికి బాలోత్సవ కమిటీ తమ వంతు కృషి చేస్తుందన్నారు. గన్నవరం ఎంపీపీ అనగాని రవి, గన్నవరం జెడ్పీటీసీ సభ్యురాలు ఎ.ఎలిజిబెత్ రాణి, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యులు ఎం డి గౌసాని మాట్లాడారు పట్టుదల, శ్రమ ఉంటే విద్యార్థులు ఉన్నత స్థాయికి వెళ్లడానికి అవకాశం ఉంటుందన్నారు. పేద కుటుంబాల్లో పుట్టిన పిల్లలు చదువును ప్రేమించాలన్నారు. ప్రభుత్వంతో పాటు పెద్దలు ఇస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి పథంలో ముందుకు వెళ్లాలని ఆకాంక్షించారు. వందలాదిమంది బాలబాలికలను ఒక చోటికి తీసుకొచ్చి పోటీలు నిర్వహించి ప్రోత్సహిస్తున్న బాలోత్సవం కమిటీ నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గన్నవరం బాలోత్సవం కమిటీ ప్రధాన కార్యదర్శి కర్రా వరప్రసాద్, ఆర్థిక విశ్లేషకులు గన్నె వెంకట్రావు, వికేఆర్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ స్వర్ణకుమారి, శ్రీ మల్లికార్జున విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎన్‌సిహెచ్ రాయుడు, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మదుపల్లి బాలకృష్ణ, బాలికోన్నత పాఠశాల హెచ్ఎం అనిత, బాలోత్సవం ఆర్గనైజర్లు మాదల వెంకటేశ్వరరావు, మరీదు వరప్రసాద్, దాసరి నవభారతి, రోటరీ క్లబ్ అధ్యక్షులు చిమట రామారావు, ఖో ఖో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు టి ఎస్ ఆర్ కే ప్రసాద్, రెడ్ క్రాస్ అధ్యక్షులు మాధవి తదితరులు పాల్గొన్నారు. ప్రముఖ వ్యాఖ్యాత కొల్లి సత్య జగదీశ్వరరావు సంధానకర్తగా వ్యవహరించారు. గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండలాల నుంచి జిల్లా పరిషత్ హైస్కూళ్ళలోని విద్యార్థిని విద్యార్థులు, ప్రైవేట్ స్కూళ్లలోని విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై పోటీల్లో గెలుపొందేందుకు పోటీపడ్డారు. కూచిపూడి నృత్యాలు, సామాజిక బాధ్యతను మేల్కొలిపే నాటికలు, పల్లె పడుచుల డ్యాన్సులు, విచిత్ర వేషాలు, తీన్మార్ డప్పులు, కోలాటాలు, చిత్రలేఖనం, మట్టి బొమ్మల తయారీ, ఇంకా ఎన్నో రకాల పోటీల్లో బాల బాలికలు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమలోని ప్రతిభను చాటారు. వివిధ రంగాల్లో నిష్ణాతులైన విద్యావంతులు, మేధావులు ఈ పోటీలకు న్యాయం నేతలుగా వ్యవహరించారు. గెలుపొందిన విజేతలకు మెడల్స్‌తో పాటు సర్టిఫికెట్లు, షీల్డ్‌లు అందజేశారు. ఇకనుంచి ప్రతి సంవత్సరం బాలోత్సవం వేడుకలు పెద్ద ఎత్తున నిర్వహిస్తామని బొడ్డు నాగేశ్వరరావు, కర్రా వరప్రసాద్ ప్రకటించారు.



సభలో మాట్లాడుతున్న టిబిఆర్ ప్రసాద్, వేదికపైన బిఎన్ఆర్ తదితరులు



హాజరైన ప్రముఖులు, ఉపాధ్యాయులు, పెద్దలు తదితరులు

పలుచోట్ల గ్రామదర్శినులు

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలోని పలు మండలాల్లో మంగళవారంనాడు పలు గ్రామదర్శిని కార్యక్రమాలు జరిగాయి.

గుడ్లవల్లేరు : మండలంలోని చంద్రాల, మామిడి కోళ్ళ, చంద్రాల గ్రామాల్లో మంగళవారం గ్రామదర్శిని కార్యక్రమాన్ని జిల్లా అధికారులు నిర్వహించారు. గ్రామాల్లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, మంచినీటి చెరువులు, వాటర్ ట్యాంకులు, హౌసింగ్ లేఅవుట్లను పరిశీలించారు. గ్రామాల్లోని సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాల సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. తౌలుత డిప్యూటీ డైరెక్టర్ ఎన్.సత్యనారాయణ చంద్రాల గ్రామాన్ని పరిశీలించగా, జిల్లా నీటి వనరులను అధికారి కె.శ్రీనివాసులు పురిటిపాడు గ్రామాన్ని, డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ యు వి సుబ్బారావు మామిడి కోళ్ళ గ్రామంలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దారపు శ్రీనివాస్, తహశీల్దార్ మహమ్మద్ రహమాన్ మస్తానా, మండల విస్తరణాధికారి వి.దిలీప్ కుమార్, ఇతర మండల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. **ఉయ్యూరు :** ప్రజలకు సమస్యలు పరిష్కరించడంలో అలసత్వం చూపరాని గ్రామ దర్శిని ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ అన్నారు. గ్రామ దర్శినిలో భాగంగా మంగళవారం గండిగుంట గ్రామంలో పర్యటించారు. ఎంపీడీవో విమాదేవి, సర్పంచ్ గెత్తం అనుపమ ఎంపీటీసీ శ్రీనివాసరావు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు. **నాగాయలంక :** భావదేవరపల్లి గ్రామంలో గ్రామ దర్శిని కార్యక్రమం జరిగింది. ప్రత్యేక అధికారి ఆనందరావు (ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎపిఇడబ్ల్యుఐడిసి, మచిలీపట్నం) రంగనాథ్‌స్వామి పాల్గొన్నారు. మొవ్వ : మొవ్వ మండలం కాజ గ్రామంలో గుడివాడ డివైఇఒ పి.విజయకుమార్ ,చినముత్తేవి గ్రామంలో మచిలీపట్నం అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్ ఎన్.వెంకటేశ్వర రెడ్డి, మొవ్వ గ్రామంలో విజయవాడ ఏపిఐఐసి జోనల్ మేనేజర్ డి.శ్రీనివాసరావు, కూచిపూడి గ్రామంలో గుడివాడ డిఎల్పిఓ జి.సంపత్ కుమారి గ్రామదర్శిని కార్యక్రమంలో బాగంగా ప్రభుత్వ కార్యాలయాలు, పిహెచ్ సి ,అంగనవాడీ కేంద్రాలు, సంక్షేమ హస్టల్లను సందర్శించి రికార్డులు పరిశీలించారు. మొవ్వ డిటి సిహెచ్ గోపాలరావు, మొవ్వ పంచాయతీ కార్యదర్శి అంజనాదేవి లతో పాటు అయా గ్రామాల స్థానిక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మూగ జీవాలకు అంబులెన్సు సేవలు : సింహాద్రి

ప్రజాశక్తి-చల్లపల్లి

మూగజీవాలైన పశువుల ఆరోగ్యాన్ని కూడా దృష్టిలో ఉంచుకొని వాటికి అత్యవసర సేవలు అందించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి పశు అంబులెన్సులు ప్రవేశపెట్టారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. చల్లపల్లి, ఘంటసాల, మోపిదేవి మండలాల కోసం ప్రభుత్వం కేటాయించిన డాక్టర్ వైయస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ అంబులెన్స్ వాహనాన్ని చల్లపల్లి ప్రధాన కూడలిలో ఆయన మంగళవారం ప్రారంభించారు. వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి కడవకొల్లు నరసింహారావు, చల్లపల్లి సబ్ డివిజన్ పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ నల్లూరి వెంకట భార్గవ, ఎంపీటీసీ మోపిదేవి ద్వారకానాథ్, వక్కలగడ్డ సర్పంచ్ వల్లూరు ఉమా, ఏపీ ఆగ్రో ఇండస్ట్రీస్ స్టేట్ డైరెక్టర్ మేరుగు ఝాన్సీలక్ష్మి, పీఏసీఎస్ ఛైర్మన్ పాగోలు నాగ సీతారామరావు (ఫణి), గ్రామ సచివాలయ కన్వీనర్ల మండల కన్వీనర్ యడ్ల జగదీష్, వైసీపీ నాయకులు బొందలపాటి లక్ష్మి, తుమ్మల వెంకటేశ్వరరావు, లంక రాజు, మోదుమూడి కుటుంబరావు, మద్దాల వీరాస్వామి, షేక్ నసీంఘోరీ, వెనిగళ్ల జగదీష్, గోవాడ రాము, మేరుగు రమేష్, అల్లంశెట్టి చలం, ఏఎంసీ డైరెక్టర్ అబ్దుల్ అర్షద్, చల్లపల్లి మండల పశు సంవర్ధక శాఖ వైద్యాధికారి డాక్టర్ పి.మనోజ్, మోపిదేవి మండల పశు సంవర్ధక శాఖ వైద్యాధికారి డాక్టర్ ఎం.నందకిషోర్, సంచార వాహనం పశు వైద్యులు డాక్టర్ అశోక్ కుమార్, వక్కలగడ్డ పశు వైద్యులు డాక్టర్ వీ.వినోద్ కుమార్, మూడు మండలాల పశు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఏర్పర్చుకోవాలి

చల్లపల్లి : చిన్నప్పటి నుండే ఉన్నత లక్ష్యాలు ఏర్పరచుకొని వాటిని ఆచరణలో పెట్టేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులను ప్రోత్సహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి టి.తాహేరా సుల్తానా అన్నారు. మంగళవారం పురిటిగడ్డ పంచాయతీ పరిధిలో జరిగిన గ్రామదర్శిని కార్యక్రమంలో ప్రత్యేక అధికారిగా పాల్గొన్న ఆమె ప్రభుత్వ కార్యాలయాలు,పాఠశాలలను సందర్శించారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పురిటిగడ్డలో విద్యార్థులతో మమేకమై వారి లక్ష్యాలు, అభిరుచులు అడిగి తెలుసుకున్నారు.

ఫుడ్‌కోర్టు అక్రమాలపై కౌన్సిల్‌లో రగడ

విచారణకు కమిటీ వేయాలని సిపిఎం, టిడిపి, వైసిపి డిమాండ

ప్రజాశక్తి-విజయవాడ : ఫుడ్ కోర్టు పేరుతో లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నాయని మీడియా కోడై కూస్తున్నా అధికార వైసిపి, అధికారులు మిన్నకుండి పోవడంలో ఆంతర్యం ఏమిటని, దీని వెనుకాల ఎవరున్నారో నిగ్గు తేల్చాలని సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు అధికార వైసిపిని డిమాండ్ చేశారు. కౌన్సిల్ ప్రశ్నోత్తరాల సమయంలో సత్యబాబు వేసిన ప్రశ్నకు అధికార వైసిపి సీనియర్ సభ్యులు బొల్లా విజయ్‌కుమార్ సైతం సంపూర్ణ మద్దతునిచ్చి, అవినీతి అక్రమాలే కాకుండా, ఇదే ఫుడ్ కోర్టులోనే రాత్రి వేళల్లో నడి రోడ్డుపైనే మద్యం విక్రయాలు కూడా జోరుగా జరుగుతున్నాయన్నారు. ఇందుకు సంబంధించి తన వద్ద ఆధారాలు కూడా ఉన్నాయని విజయ్‌కుమార్ వ్యాఖ్యానించడంతో కౌన్సిల్ మొత్తం బిత్తరపోవాల్సి వచ్చింది. నైట్ ఫుడ్ కోర్టులు ఏప్ ప్రాంతంలో ఏర్పాటు చేశారు, వ్యాపార లబ్ధిదారుల ఎంపిక ఏ ప్రాతిపదికన జరిగింది, వాటి పూర్తి వివరాలు కౌన్సిల్ ముందు ఉంచాలని సత్యబాబు డిమాడ్ చేశారు. దీంతో కౌన్సిల్‌లో దీనిపై తీవ్ర గందరగోళం నెలకొంది. సెంట్రల్ నియోజకవర్గ పరిధిలోని ఐజిఎంసి స్టేడియం కాంప్లెక్స్ వద్ద నడుస్తున్న ఫుడ్ కోర్టులో సామాజిక రిజర్వేషన్ ప్రకారం షాపుల కేటాయింపు జరగకపోగా, ప్రతి షాపు వద్ద నుంచి రూ.5 లక్షల నుండి రూ.7 లక్షల వరకు చేతులు మారినట్లు మీడియాలో కథనాలు వచ్చాయని, ఈ అవినీతి భాగోతంపై సమగ్ర విచారణ జరిపించాలని సత్యబాబు పట్టుబట్టారు. ఇదే అంశంపై టిడిపి ఫ్లోర్‌లీడర్ కూడా తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఫుడ్ కోర్టు అంశం కోర్టు పరిధిలో ఉన్నందున వ్యాపారుల పేర్లు బయటకు వెల్లడించడానికి అవకాశం లేదని, తమ పరిధిలో అంశం కాదని విఎంసి ఎస్టేట్ ఆఫీసర్ అంబేద్కర్ చెప్పిన సమాధానంపై సిపిఎం, టిడిపి, వైసిపి సభ్యులు తీవ్ర అభ్యంతరం చెప్పారు. ఫుడ్ కోర్టు వ్యహారంపై ఒక కమిటీ వేసి సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బిఆర్‌టిఎస్ రోడ్డులో కూడా అనధికారికంగా ఫుడ్ కోర్టు నడుస్తూ ప్రమాదాలకు కారణమవుతోందని వైసిపి సభ్యులు జానారెడ్డి అన్నారు. ఫుడ్‌కోర్టు సక్రమంగా నడిచేందుకు, అక్కడ జరుగుతున్న అవకతవకలను కట్టడి చేయడానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ స్వప్నిల్ దినకర్ సమాధానమిచ్చారు. ఫుడ్ కోర్టుపై చర్చ ముగిసిన అనంతరం ఎమ్మెల్యే విష్ణు కౌన్సిల్‌కు హాజరు కావడం గమనార్హం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులను తీసుకురావడంలో అధికార వైసిపి ఘోరంగా విఫలమైందని సత్యబాబు విమర్శించారు. రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్ అసెస్‌మెంట్స్ వివరాలన్నీ సమగ్రంగా లేవని టిడిపి సీనియర్ సభ్యులు జాస్తి సాంబశివరావు అన్నారు. వివెల్‌టిల నుంచి రావాల్సిన రాబడిని రాబట్టడంలో విఎంసి విఫలమయిందని, కనీసంగా వాటిని గుర్తించలేకపోతుందని టిడిపి సభ్యులు ముమ్మనేని ప్రసాద్ అన్నారు.



కరాటే కుంగ్‌ఫూ పోటీల్లో సుందరయ్య నగర్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఫస్ట్ ఓపెన్ కరాటే కుంగ్‌ఫూ రాష్ట్రస్థాయి పోటీల్లో గుంటూరు జిల్లా తాడేపల్లి సుందరయ్య నగర్‌కు చెందిన టైగర్ పవర్ క్లబ్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కృష్ణాజిల్లా హనుమాన్ జంక్షన్‌లోని కాకాని కళ్యాణమండపంలో ఆదివారం జరిగిన ఫస్ట్ ఆంధ్రప్రదేశ్ ఓపెన్ కరాటే కుంగ్‌ఫూ టోర్నమెంట్లో సుందరయ్య నగర్‌లోని టైగర్ పవర్ క్లబ్‌కు చెందిన విద్యార్థులు పెద్దపాటి బేబీ భవ్యశ్రీ 63 కిలోల విభాగంలో, నంద్యాల వెంకట శాలిని మైనస్ 30 కిలోల భాగంలో, పోలూరు వెంకట వర్షిని 40 కిలోలు, పట్టేటి ఉదయ్ కిరణ్ 35 కిలోలు, దొంత పవన్ శశాంక్ కుమార్ 40 కిలోలు, చిట్టికిరెడ్డి దినేశ్వర్ 60 కిలోలు, ముంజేటి నరేంద్ర 35 కిలోలు, బంకాల రోహిత్ వెంకట కుమార్ 30 కిలోలు, బంకల మౌర్య తేజ 45 కిలోలు విభాగాల్లో మొదటి స్థానాలు సాధించారు. మహమ్మద్ అష్రఫునిసా 63 కిలోలు, ముంజేటి వర్షిని వెంకట భవాని 30 కిలోల విభాగాల్లో రెండో స్థానాలు సాధించినట్లు కోచ్ విష్ణు మొలకల సంఘవి తెలిపారు. మొత్తం 26 జిల్లాలకు చెందిన 800 మందికి పైగా పాల్గొన్న ఈ టోర్నమెంట్లో తమ విద్యార్థులు సత్తాచాటినట్లు తెలిపారు.

ఏ బడ్జెట్ నుంచి నిధులు కేటాయిస్తారు : నెల్లిబండ్ల బాలస్వామి, టిడిపి ఫ్లోర్‌లీడర్

ప్రజాశక్తి - విజయవాడ : మునిసిపల్ నిబంధనల ప్రకారం ప్రతి ఏటా జనవరి 10లోపు బడ్జెట్‌పై కౌన్సిల్ నిర్వహించి, దాని ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపాల్సి ఉంటుంది. కానీ ఈఏడాది జనవరి పూర్తయినా అధికార వైసిపి చేతకాని తనం వల్ల నేటికీ బడ్జెట్ సమావేశం నిర్వహించలేదు. పెన్షన్ల తొలగింపుపై అధికార పక్షం వద్ద సరైన సమాధానం లేదు. వైసిపి ఆగడాలు, అప్రజాస్వామిక విధానాలపై ప్రశ్నించినందుకు మమ్ములను సస్పెండ్ చేశారు.

ఇళ్లకు నీటి మీటర్లు పెట్టొద్దని టిడిపి, సిపిఎం ర్యాలీ

విజయవాడలో ఇళ్లకు నీటి మీటర్లు బిగించవద్దని, రద్దు చేసిన పెన్షన్లను పునరుద్ధరించాలని కోరుతూ టిడిపి, సిపిఎం నిరసన ర్యాలీ నిర్వహించారు. కౌన్సిల్ సమావేశానికి ముందు విఎంసి కార్యాలయంలోని బ్యాంక్ సెంటర్ నుంచి కౌన్సిల్ హాలు వరకు విపక్ష సభ్యులు ప్లకార్డులు చేబూని నిరసన ర్యాలీ నిర్వహించారు. టిడ్కో గృహాలు పూర్తి చేసి అప్పగించాలని, మునిసిపల్ కార్మికుల ప్రమాద బీమా రూ.20 లక్షలు అమలు చేయాలని, ఆప్కాస్ కార్మికులకు ఆదివారం పూర్తి సెలవు అమలు చేయాలని, ఇళ్ల పట్టాలు, రిజిస్ట్రేషన్ చేయాలని కోరుతూ సభ్యులు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి, సిపిఎం ఫ్లోర్‌లీడర్లు నెల్లిబండ్ల బాలస్వామి, బోయి సత్యబాబు, వైసిపి డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు (చంటి), సీనియర్ టిడిపి సభ్యులు జాస్తి సాంబశివరావు, ముమ్మనేని ప్రసాద్, చెన్నుపాటి ఉషారాణి, కేశినేని శ్వేత తదితరులు పాల్గొన్నారు.

మండాపు, రెడ్డయ్యకు సంతాపం

ఇటీవల మృతి చెందిన మాజీ సిపిఎం కార్పొరేటర్ మండాపు వెంకటేశ్వరరావుకు, మాజీ ఎంపి కొలుపు రెడ్డయ్యకు కౌన్సిల్ సంతాపం తెలిపింది.వారి సేలను గుర్తుచేస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేశారని ఈ సందర్భంగా సభ్యులు గుర్తు చేశారు.

విపక్షాల ఆందోళన సరికాదు : మేయర్ భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి-విజయవాడ : పెన్షన్లు కోత విధించారని విపక్షాలు చేస్తున్న ఆందోళన సరికాదని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. కౌన్సిల్ సమావేశం అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ కౌన్సిల్ సమావేశంలో నగర ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలతోపాటు అనేక ఇతర అంశాలపై చర్చ జరిపి నిర్ణయాలు తీసుకున్నట్లు చెప్పారు. నగర వ్యాప్తంగా గత టిడిపి పాలనతోపోలిస్తే పెన్షన్ల సంఖ్య తమ పాలనలోనే పెరిగాయని అన్నారు.

మొదటి పేజీ తరువాయి

పింఛన్ల తొలగింపుపై విపక్షాల ఆగ్రహం

ఫ్లెక్సీని ప్రదర్శిస్తూ సాయంత్రం 4 గంటల వరకు నిరసన తెలిపారు. అజెండాలో 16వ అంశాన్ని సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు ప్రస్తావించడంతో అధికార వైసిపిని ఇరకాటంలో పడేసింది. తొలగించిన రెండు వేలకుపైగా పింఛన్లకు సంబంధించి గణాంకాలు, ఉదాహరణలతో సహా సత్యబాబు కౌన్సిల్ ముందుంచారు. దీనికి మద్దతుగా టిడిపి ఫ్లోర్‌లీడర్ నెల్లిబండ్ల బాలస్వామి, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు, సీనియర్ సభ్యులు ముమ్మనేని ప్రసాద్ తమతమ డివిజన్లలో పింఛన్ల తొలగించారని, బాధితులు అవస్థలు పడుతున్నారని అన్నారు. ఈ అంశంపై సిపిఎం, టిడిపి సభ్యులు అరగంటకు పైగా నిలదీశారు. జనవరి నుండి రూ.250 అదనంగా ఫించన్ పెంచుతున్నామనే ప్రచారం మాటున విజయవాడ నగరంలో 4 వేల మంది పింఛన్ దారులకు నోటీసులిచ్చారని, వీరిలో రెండు వేల మంది పింఛన్లను రద్దు చేయడం ఏమిటని సత్యబాబు ప్రశ్నించారు. తన డివిజన్‌లోనే రేకుల షెడ్డులో ఉంటున్న ఆంజనేయులు, మాటలు కూడా రాని వృద్ధురాలు ఆకుల వెంకటసుబ్బమ్మకు సైతం పింఛన్ తొలగించడం దుర్మార్గమని అన్నారు. తొలగింపుకు గల కారణాలపై అధికార వైసిపి నుంచి సరైన సమాధానం రాకపోవడంతో మేయర్ పోడియం వద్ద టిడిపి, సిపిఎం సభ్యులు నిరసన తెలిపారు. అధికార పక్షానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో కౌన్సిల్‌లో గందరగోళం నెలకొంది. వైసిపి, విపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం సాగింది. ఈ నేపథ్యంలో ఎంఎల్ఎ మల్లాది విష్ణు కనుసైగలతో మేయర్ భాగ్యలక్ష్మి విపక్ష సభ్యులను సస్పెండ్ చేశారు. మార్షల్ సాయంలో బయటకు పంపారు. దీంతో మిగిలిన సభ్యులు వాకౌట్ చేశారు. సమావేశం ముగిసేంత వరకు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ క్రమంలో అజెండాలో అత్యంత ముఖ్యమైన అంశాలతోపాటు మిగిలిన 17వ అంశం నుంచి 134వ అంశం వరకు ఎటువంటి చర్చ అధికార వైసిపి ఆమోదించుకుంది. అంతేగాక మధ్యాహ్నం 1.45 గంటలకే కౌన్సిల్‌ను ముగించడం గమనార్హం. ఐరన్‌యార్డు, మ్యాంగో మార్కెట్, యర్రకట్ట ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురాలేకపోవడం అధికార వైసిపి వైఫల్యమని సిపిఎం ఫ్లోర్‌లీడర్ సత్యబాబు మండిపడ్డారు. వన్‌టౌన్ ఎర్రకట్ట రోడ్డు మరమ్మతులను తక్షణం చేపట్టాలని కోరారు. పందులు, కుక్కలు, ఆవుల బెడద నివారణలో అధికారులు విఫలమయ్యారని ఎంఎల్ఎ విష్ణు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఆయనకు మద్దతుగా కార్పొరేటర్లు వీటి బెడద నుంచి కాపాడాలని కోరారు.

నిధుల కేటాయింపు ఉంటుందా ?

లింకు రైలు మార్గ నిర్మాణానికి రూ. 1540. 62 కోట్లు, మచిలీపట్నం నుంచి రేపల్లె వరకు 45 కిలోమీటర్లకు రూ. 1151.63 కోట్లు, ంపల్లె నుంచి నిజాంపట్నం మీదుగా బాపట్ల వరకు 45.81 కిలోమీటర్లకు రూ.792.33 కోట్లు వ్యయం అవుతుందని అంచనా. మొత్తంగా నరసాపురం నుంచి మచిలీపట్నం మీదుగా బాపట్ల వరకు 164.84 కిలోమీటర్ల కోస్తా లింకు రైలు మార్గం నిర్మాణానికి రూ. 3484.58 కోట్ల ఖర్చు అవుతుందని అంచనా వేశారు. ఆరేళ్ల క్రితం వేసిన ఈ అంచనాలు ఇప్పటికీ ఆచరణకు నోచుకోలేదు. ప్రస్తుతం పెరిగిన ధరలను పరిగణలోకి తీసుకుంటే ఈ వ్యయం మరింత పెరుగుతుంది. కొన్ని రోజుల క్రితం బందరు ఎంపి బాలశౌరి కోస్తా లింకు మార్గంలో భాగంగా ఉన్న మచిలీపట్నం- రేపల్లె రైలు మార్గాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా కేంద్రాన్ని విజ్ఞప్తి చేశారు. బడ్జెట్ కేటాయింపుల్లో ఎంపి విజ్ఞప్తులను ఏ మేరకు పరిగణలోకి తీసుకుంటుందో చూడాల్సి ఉంది. రైలు నీరు ప్రాజెక్టులో భాగంగా వాటర్ బాట్లింగ్ ప్లాంటును కేంద్రం రూ.15 కోట్లతో విజయవాడ డివిజన్‌లో ఏర్పాటు చేస్తామని గతంలో చెప్పింది. ఈ నేపథ్యంలోనే బాపులపాడు మండలం మల్లవల్లి మోడల్ ఇండస్ట్రియల్ పార్కులో దీని నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం స్థలాన్ని కేటాయించింది. అయితే ఆరేళ్లవుతున్నా ప్రాజెక్టు ఏర్పాటుకు నిధులు విడుదల కాలేదు. విజయవాడ -కొండపల్లి-కాజీపేట డబ్లింగ్, విజయవాడ - గుంటూరు - అమరావతి, రాజధాని అమరావతికి నూతన రైలు మార్గం ఏర్పాటుకు సంబంధించి కేంద్రం నిధులు కేటాయించాల్సి ఉంది.

గుడివాడలో అరుదైన శస్త్ర చికిత్స

డాక్టర్ వంశీ ఆధ్వర్యంలో విజయవంతం

ప్రజాశక్తి-గుడివాడ

గుడివాడ శ్రీ రామా నర్సింగ్ హోమ్ వైద్యులు డాక్టర్ పొట్లూరి వంశీ 14 సంవత్సరాల వయసు గల బాలిక కడుపులో నుండి 1కేజీ వెంట్రుకలను తీసి అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా చేశారు. మంగళవారం స్థానిక శ్రీ రామా నర్సింగ్ హోమ్ వైద్యులు డాక్టర్ పొట్లూరి వంశీకృష్ణ విలేకర్లతో మాట్లాడారు. ట్రైకో బీజోర్


బయటకు తీసిన వెంట్రుకలను చూపుతున్న డాక్టర్

సమస్యతో 10 ఏళ్లుగా జుట్టును తినడం అలవాటుగా మార్చుకున్న 14 ఏళ్ల బాలిక కడుపు నొప్పి, వాంతులుతో అసుపత్రికి వచ్చిందన్నారు. ఎండోస్కోపు ద్వారా పరీక్షలు నిర్వహించగా కడుపులో తల వెంట్రుకలు కనిపించాయన్నారు. వెంటనే అరుదైన శస్త్ర చిక్సిత చేసి కడపులో నుండి సుమారు 1కిలో జుట్టును బయటకు తీశామన్నారు. ఆపరేషన్ అనంతరం బాలిక సంపూర్ణ ఆరోగ్యంతో ఉందన్నారు. ఇలాంటి వైద్యం తాను 16 సంవత్సరాల సర్వీసులో ఇదే మొదటిదన్నారు. ఇలాంటి వ్యాధి లక్షల్లో ఒకరికి ఉండే అవకాశం ఉందన్నారు. రక్తహీనత వల్ల చిన్నతనంలోనే ఇంట్లో పడేసే వెంట్రుకలను తినడం అలవాటు చేసుకుంటారన్నారు. ప్రతి ఇంట్లో మహిళలు తల దువ్వుకునేటప్పుడు వెచ్చే వెంట్రుకలు పిల్లలకు అందకుండా చూడాలన్నారు. ఈ శస్త్ర చికిత్సలో తనతో పాటు మత్తు డాక్టర్ శివప్రసాద్, సిబ్బంది సాంబశివరావు, శివాజీ, అజయ్, నవీన్, శాంతకుమారి పాల్గొన్నారు.

ఎంపిడిఒ కార్యాలయాన్ని సందర్శించిన రష్మీశర్మ

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థ పని తీరు అధ్యయం చేసేందుకుగాను రిటైర్డ్ ఐఎఎస్ అధికారి రష్మీ శర్మ తమ బృందంతో మంగళవారం మచిలీపట్నం ఎంపిడిఒ కార్యాలయాన్ని సందర్శించారు. రెవెన్యూ, వ్యవసాయం, సాంఘిక సంక్షేమం, పంచాయతీరాజ్, విద్య వంటి కీలక శాఖల జిల్లా అధికారులతో విడివిడిగా సమావేశమై వారి శాఖల ద్వారా అమలవుతున్న కార్యక్రమాల గురించి ఆరా తీశారు. ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ లోటు పాట్లు సరి చేసుకుని, మరింత మెరుగుపరచి ఉత్తమ ఫలితాలు సాధించుటకు తీసుకోవాల్సిన చర్యలు, సూచనలు, సలహాలు స్వీకరించారు. వివిధ శాఖల అధికారుల అభిప్రాయాలు క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. తొలుత జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్ వివిధ శాఖల అధికారులు ఎంపిడివో కార్యాలయం వద్ద రిటైర్డ్ ఐఎఎస్ అధికారికి స్వాగతం పలికారు. డిఆర్ఒ ఎం.వెంకటేశ్వర్లు, డ్వామా పిడి జి.వి.సూర్యనారాయణ, డిపిఒ నాగేశ్వరనాయక్, జెడ్పి సిఇఒ జిశ్రీనివాసరావు, సాంఘిక సంక్షేమశాఖాధికారిణి సరస్వతి, వ్యవసాయశాఖ డిడి మణిధర్, ఎంఇఒ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న రష్మీశర్మ

ఉన్నత చదువులు చదివించే బాధ్యత ప్రభుత్వానిదే : జోగి

ప్రజాశక్తి-గూడూరు

పిల్లలకు తల్లిదండ్రులు ఇచ్చే నిజమైన ఆస్తి చదువేనని, ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉన్నా, ఉన్నతమైన చదువులు చదివించే బాధ్యత ముఖ్యమంత్రి


సమస్యలను తెలుసుకుంటున్న మంత్రి జోగి రమేష్

జగన్మోహన్‌రెడ్డి వహిస్తారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ భరోసా ఇచ్చారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గూడూరు మండల పరిధిలో రాయవరం గ్రామంలో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన పలువురు రాయవరం గ్రామస్తులు, వారి పిల్లలతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తూ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎన్నో విద్యా సంస్కరణలు ప్రవేశపెట్టిందన్నారు. ప్రధానంగా మనబడి నాడు-నేడు, జగనన్న విద్యాకానుక, జగనన్న అమ్మబడి, జగనన్న గోరుముద్ద లాంటి బృహత్కరమైన కార్యక్రమాల ద్వారా శ్రీకారం చుట్టిందన్నారు. పెద్ద చదువుల వల్ల ఏ ఒక్క తల్లి, తండ్రి అప్పుల పాలయ్యే పరిస్థితి రాకూడదని పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తున్నారన్నారు. భోజనం, వసతి ఖర్చుల కోసం పిల్లలు, తల్లిదండ్రులు ఇబ్బంది పడకూడదనే వసతి దీవెన పథకాన్ని సిఎం జగన్ అమలుచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాయవరం గ్రామ సర్పంచ్ నందం మల్లేశ్వరి రవికిరణ్, పిఎసిఎస్ అధ్యక్షులు కోళ్ల వీర వెంకట బాలకృష్ణ, వైసిపి గూడూరు మండల ఉపాధ్యక్షులు కోళ్ల వీర వెంకట నాంచారయ్య, రాయవరం ఆర్‌బికె చైర్మన్ ఉప్పలపు రాఘవయ్య, గూడూరు ఎంపిపి సంగా మధుసూదనరావు, జెడ్పిటిసి సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, వైస్ ఎంపిపిలు పిచ్చుక గంగాధరరావు, నేతల కుటుంబరావు, కారుమంచి కామేశ్వరరావు, పర్ణం మహాలక్ష్మినాయుడు (పెదబాబు), వైసిపి మండల అధ్యక్షులు గొరిపర్తి రవి, గూడూరు తహశీల్దార్ బి.విజయ ప్రసాద్, ఎంపిడివో సుబ్బారావు, స్థానిక ప్రజా ప్రతినిధులు, వైసిపి నాయకులు, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోడూరులో కుచించుకుపోతున్న రహదారి


ఆక్రమణకు గురైన రోడ్డు ఇదే...

ప్రజాశక్తి-కోడూరు

మండల కేంద్రమైన కోడూరులోని సాయిబాబా ఆలయం ఎదురుగా ఉన్న జగనన్న లేఔట్‌లో ఉన్న ప్రధాన రహదారి రోజురోజుకూ కరిగిపోతుందని లబ్ధిదారులు వాపోతున్నారు. ఇళ్ల పట్టాలు ఇచ్చి దాదాపు 2 సంవత్సరాలు గడుస్తున్నా సరైన మార్గం లేక లబ్ధిదారులు రెండు సంవత్సరాల నుంచి గృహ నిర్మాణాలు చేపడుతూనే ఉన్నారు. ప్రభుత్వం వారు లేఔట్‌లో వేసిన రహదారిని కొంతమంది రైతులు మాయంచేసి నాట్లు వేశారు. మరి కొంతమంది లేఔట్‌లో ఉన్న రహదారిని అడ్డంగా జెసిబితో కట్ చేసి మురికి బోదుకు వాడుకుంటున్నారు. దాని కారణంగా కనీసం లేఔట్ లో ఈ చివరి నుంచి ఆ చివరి వరకు నడిచే పరిస్థితి కూడా లేదు. ప్రస్తుతం మరి కొంతమంది రైతులు ఇంకో అడుగు ముందుకు వేసి రహదారిలో జెసిబితో మురికి నీరు పోవడానికి బోదు తవ్వుతున్నారు. 5 మీటర్లు ఉండాల్సిన రోడ్డు ఈ రకంగా మాయమైపోతే తాము ఇల్లు కట్టుకున్న తర్వాత అక్కడ ఎలా తిరగాలని లబ్ధిదారులు వాపోతున్నారు. అసలే ఇంతవరకు ఇక్కడ కరెంటు సదుపాయం కూడా లేదని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు, స్థానిక ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు ఈ విషయంపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

అర్జీలను తక్షణమే పరిష్కరించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-పమిడిముక్కల

గ్రామదర్శినిలో అధికారుల దృష్టికి వచ్చిన సమస్యలపై తక్షణం స్పందించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులకు సూచించారు. గ్రామదర్శిని నాల్గో విడత కార్యక్రమంలో భాగంగా పమిడిముక్కల మండలం మర్రివాడ గ్రామంలో మంగళవారం ఆయన పర్యటించారు. గ్రామ సచివాలయం, అంగన్వాడీ కేంద్రం, పాఠశాల, జగనన్న లేఅవుట్లోని ఇళ్ల నిర్మాణాలు, రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించి గ్రామంలోని సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. మొదటిగా ఆయన గ్రామ సచివాలయాన్ని సందర్శించి రిజిస్టర్లను పరిశీలించారు. గ్రామంలోని బాలికలతో పాటు స్త్రీలందరికి అనీమియా (రక్తహీనత) పరీక్షలు సక్రమంగా చేస్తున్నదీ, లేనిదీ ఆ గ్రామ ఎఎన్ఎంను అడిగి రిజిస్టర్‌ను పరిశీలించారు. అనీమియా బాధితులకు ఐరన్ సప్లిమెంట్స్ అందించాలని ఎఎన్ఎంకు సూచించారు. పక్కనే ఉన్న నీటి సరఫరా ఓవర్‌హెడ్ ట్యాంకును పరిశీలించి ఎన్ని రోజులకు ఒకసారి శుభ్రం చేస్తున్నది, క్లోరినేషన్ వంటి వాటిపై ఆరా తీశారు. నెలలో రెండు సార్లు కనీసంగా ట్యాంకును శుభ్రపరచేలా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇకి సూచించారు. అంగన్వాడీ కేంద్రంలో అమలవుతున్న మెనూను పరిశీలించి పిల్లలతోపాటు గర్భవతులకు సరైన పోషకాహారం సక్రమంగా అందించాలన్నారు. అంగన్వాడీలోని పిల్లలకు బొమ్మలు చూపుతూ బోధించడం ద్వారా తొందరగా గ్రహించే అవకాశం ఉందని, ఆ పద్ధతిని అవలంభించాలని అంగన్వాడీ టీచర్‌కు సూచించారు. పాఠశాలలో నాడు-నేడు కార్యక్రమం ద్వారా చేపట్టిన


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌భాష

పనులు త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. పాఠశాలలోని వంటశాల, మరుగుదొడ్లు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థులతో ముచ్చటించి, ఉపాధ్యాయుడుగా మారి వారికి కొద్ది సేపు పాఠాలను బోధించారు. అనంతరం గ్రామంలో జగనన్న లేఅవుట్లోని ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. పురోగతి పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్ నిర్దేశించిన సమయానికి ఇళ్లను పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. గ్రామంలోని రైతులు, ప్రజలతో ముచ్చటించారు. పింఛను, సమయానికి రేషన్ సరుకులు, ధాన్యం సేకరణపై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ చెరువు పూడికతీత తీయించాలని గ్రామస్తులు కోరడంతో, తప్పనిసరిగా చేయిస్తామని కలెక్టర్ వారికి హామీ ఇచ్చారు. పమిడిముక్కల తహశీల్దార్ కె.వి.శివయ్య, గ్రామ సర్పంచ్ ఒంపుగడవుల ఫ్రాన్సిస్, ఉప సర్పంచ్ డొక్కు నాగకుమార్, ఎంపిటిసి ఓబా మల్లేశ్వరి, డిఇ నిరీక్షణరావు, ప్రధానోపాధ్యాయులు కె.నాగరమేష్. ఇతర అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ మేళా

మచిలీపట్నం డివిజన్ సూపరింటెండెంట్ యు.యలమందయ్య

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్

బుధవారంనాడు భారత తపాలాశాఖ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్‌పై మేళాను ఏర్పాటుచేసినట్లు మచిలీపట్నం డివిజన్ సూపరింటెండెంట్ యు.యలమందయ్య తెలిపారు. బుధవారానికి భారత్ తపాలా శాఖ 140 సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తపాలాశాఖ మెగా పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ మేళా నిర్వహిస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా మచిలీపట్నం డివిజన్ పరిధిలో మేళా, క్లెయిమ్ సెటిల్మెంట్ కోసం ప్రత్యేక డ్రైవ్, ప్రసంగ్-లూ నిర్వహిస్తామన్నారు. వయ్యస్సు 19 నుండి 55 సం.ల మధ్య డిగ్రీ, డిప్లొమా, ఐటిఐ చదువుకున్న, ప్రభుత్వ, కార్పొరేషన్ ఉద్యోగులు, వృత్తి విద్యనిపుణులు, ప్రైవేట్ విద్యాసంస్థల ఉద్యోగులు అందరూ భారత దేశంలోనే అత్యధిక బోనస్ ఇచ్చే పిఎల్ఐ పాలసి తీసుకోడానికి అర్హులని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటులో గ్రామీణ తపాలా భీమా పాలసీలు ఉన్నాయని, దురదృష్టవశాత్తు పాలసీదారుడు ముందుగా మరణిస్తే వాయిదాలతో సంబంధం లేకుండా పాలసీ విలువ అప్పటి వరకు జమయిన బోనస్ చెల్లించ బడుతుందని తెలిపారు. ప్రీమియం దేశ వ్యాప్తంగా అన్ని పోస్టు ఆఫీసుల్లో చెల్లించొచ్చునని వివరించారు. www.pli.indiapost.gov.in online లో కూడా చెల్లించొచ్చునని పేర్కొన్నారు. ఎలాంటి అదనపు రుసుం లేకుండా నామినేషన్ ఉచితంగా మార్చుకోవచ్చన్నారు. పిఎల్ఐ ఎండోమెంట్ పాలసీకి ప్రతి రూ.1000 బీమాకు రూ.52, హోల్‌లైఫ్ పాలసీలకు రూ.76 బోనసుగా ఇవ్వబడుతుందని వివరించారు. ఆదాయపు పన్ను మినహాయింపు కూడా ఉంటుందని తెలిపారు.



రాష్ట్ర బిసి చైతన్యసమితి ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసరావు

ప్రజాశక్తి-పెదపారుపూడి

పామర్రు నియోజకవర్గం తోట్లవల్లూరు మండలం రొయ్యూరు గ్రామానికి చెందిన బిసి నాయకుడు లుక్కా వెంకట శ్రీనివాసరావు రాష్ట్ర బీసీ చైతన్య సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు సమితి రాష్ట్ర అధ్యక్షులు రమణ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నానని శ్రీనివాసరావు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సర్పంచ్‌లతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకుని వాటికి పరిష్కారం చూపాలని రమణ తనను కోరారని


శ్రీనివాసరావుకు నియామకపత్రాన్ని అందజేస్తున్న రమణ

శ్రీనివాసరావు విలేకరులకు తెలిపారు. గత 30 సంవత్సరాలుగా బిసి నాయకుడిగా తోట్లవల్లూరు మండలంలో బిసిల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నట్లుగా వివరించారు. భవిష్యత్తులో కూడా బిసిల సమస్యల పరిష్కారానికి తనవంతుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కృషిచేస్తానని తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి సర్పంచ్‌లు ఎదుర్కొంటున్న సమస్యలపై రమణ ఆదేశాల మేరకు తెలుసుకుంటున్నామని త్వరలోనే తమ దృష్టికి వచ్చిన సమస్యలపై గుంటూరు జిల్లా ఉండవల్లిలో ఆత్మీయ సమావేశం జరగనుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త దుంగా రాజకుమార్ వడ్డీ రవి తదితరులు పాల్గొన్నారు.

'జనసేన' సీతారామాంజనేయులు మృతి

ప్రజాశక్తి-మోపిదేవి

జనసేన పార్టీ మోపిదేవి మండల సీనియర్ నాయకుడు కోసూరు సీతారామాంజనేయులు గుండెపోటుతో మరణించారు. ఆయన పిఎసిఎస్ మాజీ అధ్యక్షులుగా, విద్యాకమిటీ మాజీ చైర్మన్, మోపిదేవి మండల యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు వంటి మరెన్నో ఉన్నత పదవులను అలంకరించి అతి పిన్న వయస్సులోనే అత్యంత ప్రజాదరణ పొందిన వ్యక్తిగా సీతారామాంనేయులు ఎదిగారు. ఆయన అకాల మరణానికి మండల జనసేన పార్టీకి తీరని లోటు అని మండల నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీతారామాంజనేయులు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



చిన్నారుల విచిత్ర వేషధారణ



మట్టి బొమ్మలు తయారు చేస్తున్న చిన్నారులు









కోలాటం....



వెల్లివిరిసిన కళా ప్రతిభ

- ముగిసిన అమరావతి బాలోత్సవం
- 161 పాఠశాలల నుంచి వేలాది మంది విద్యార్థుల సందడి

ప్రజాశక్తి-వన్‌టౌన్: విజయవాడ కొత్తపేటలోని పొట్టి శ్రీరాములు చలువాది మల్లికార్జునరావు ఇంజనీరింగ్ కాలేజిలో జరుగుతున్న అమరావతి బాలోత్సవం 5వ పిల్లల పండుగలో చిన్నారుల కళా ప్రతిభ వెల్లివెరిసింది. కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, ఏలూరు జిల్లాలకు చెందిన 161 పాఠశాల నుంచి 7,600 మంది విద్యార్థిని విద్యార్థులు వివిధ సాంస్కతిక కార్యక్రమాల్లో పాల్గొని తమ ప్రతిభను చాటారు. మూడు రోజుల పాటు జరిగిన బాలోత్సవంలో చివరి రోజు మంగళవారం పలు వేదికలపై జరిగిన కార్యక్రమాలలో పిల్లలు పాల్గొని అలరించారు. దేశభక్తి గీతాలాపనలో సీనియర్స్ విభాగంలో పలువురు విద్యార్థులు దేశభక్తిని చాటే విధంగా పలు గీతాలు ఆలపించారు. 'జయ జయ జయహో' దేశభక్తి చాటుతూ భరతమాత పాటను సిద్ధార్థ పబ్లిక్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు ఆలపించారు. "భరతమాత పాదాలకు మువ్వలం.. దేశమాత పాదాలకు మువ్వలం", "తేనెల తేటలు మాటలతో" గన్నవరంకు చెందిన స్రవంతి పాఠశాల విద్యార్థినిలు శ్రోతలను అలరించారు. విచిత్ర వేషధారణ జూనియర్స్ విభాగం నుంచి చరిత్రను వివరిస్తూ ఝాన్సీ లక్ష్మీబాయి, వీర పాండ్య కట్ట బ్రహ్మన్న వేషధారణ, శ్రీకష్ణదేవరాయల వేషధారణ, రుద్రమదేవి, మన జాతీయ పక్షి నెమలి వంటి విచిత్ర వేషధారణల్లో చూపర్లను కట్టిపడేశారు. కోలాటం సీనియర్ విభాగంలో నిర్వహించిన పోటీలు ఆద్యంతం చూపరులను ఆకట్టుకున్నాయి. విద్యాధరపురం రవీంద్ర భారతికి చెందిన షేక్ అహ్మద్ డాక్టర్ బాబ సాహెబ్ అంబేద్కర్‌లా తన నటనతో అలరించారు. సబ్ జూనియర్స్ విభాగంలో రైమ్స్ తెలుగు, ఇంగ్లీష్ తమ ముద్దు ముద్దు మాటలతో ఆకట్టుకున్నారు. జూనియర్స్, సీనియర్స్ విభాగాలలో వకృత్వం తెలుగు, ఇంగ్లీషులలో, పద్య భావం, క్విజ్, డిబేట్, తెలుగులో మాట్లాడటం వంటి పోటీలలో పిల్లలు తమదైన శైలిలో ప్రతిభను చాటారు.

మట్టితో బొమ్మల తయారీ

కళాశాల ప్రాంగణంలో 300 మంది విద్యార్థులు పాల్గొని మట్టితో తమ ప్రతిభను కనబరుస్తూ వివిధ రకాల బొమ్మలను తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా మట్టి బొమ్మల తయారు చేస్తున్న సందర్భంగా బాలోత్సవ నిర్వాహకురాలు పి.జ్యోత్స్న, నలంద ఎన్‌ఎస్‌ఎస్ ఇన్‌చార్జ్ కెవిఆర్ పర్యవేక్షించారు. విద్యార్థులు మట్టితో చేసిన బొమ్మలలో చూపరులను ఆకట్టుకుంది. వివిధ రకాల పండ్లు, మొక్కలతో, పార్కు, వాహనాలు, విమానం, వినాయకుని ప్రతిభలు, బోటు, పండుగ శోభను సంతరించుకునేలా పల్లెటూరి వాతావరణంలో బొమ్మలను తీర్చిదిద్దారు. ఈ కార్యక్రమాలను బాలోత్సవ ప్రధాన కార్యదర్శి రామిశెట్టి కొండలరావు, అధ్యక్షులు ఎస్.పి.రామరాజు, ఆఫీస్ బేరర్స్ యార్లగడ్డ సుబ్బారావు, వెన్నా వల్లభరావు, ఎ.వి రామరాజు, గోళ్ల నారాయణరావు తదితరులు పర్యవేక్షించారు.

ప్రతి విద్యార్థికీ సృజనాత్మకత అవసరం

- అమరావతి బాలోత్సవం ముగింపు సభలో కలెక్టర్ డిల్లీరావు
- పలు అంశాల్లో విజేతలకు బహుమతులు ప్రదానం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కలెక్టర్ డిల్లీరావు, ఎమ్మెల్యే వెలంపల్లి

ప్రజాశక్తి-వన్‌టౌన్

ప్రతి విద్యార్థికి సృజనాత్మకత అవసరమని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. గత మూడు రోజులుగా వన్‌టౌన్ కొత్తపేటలోని శ్రీ పొట్టి శ్రీరాములు చలువాది మల్లికార్జునరావు ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న అమరావతి బాలోత్సవం ఐదవ పిల్లల పండుగ ముగింపు సభ మంగళవారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. సభకు అమరావతి బాలోత్సవం ప్రధాన కార్యదర్శి రామిశెట్టి కొండలరావు అధ్యక్షత వహించగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆట పాటల్లోనూ రాణించాలన్నారు. గత మూడు రోజులుగా బాలోత్సవం నిర్వహణలో పిల్లలకు సృజనాత్మకతను పెంపొందించే విధంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమన్నారు. పిల్లలకు పండుగల విశిష్టతలను తెలియజేప్పే విధంగా కూడా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

మాజీ మంత్రి, పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు లాంటి వాటిల్లో కూడా రాణించాలని విద్యార్థులను కోరారు. రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి విద్యకు పెద్దపీట వేస్తున్నారని, దాన్ని అందిపుచ్చుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు మాట్లాడుతూ పూర్వం తాము చదువుకునే రోజుల్లో పాఠశాలల్లో గ్రౌండ్ ఉండేదని, ఆటపాటల్లో పాల్గొనేవారమన్నారు. నేటి పోటీ ప్రపంచంలో పిల్లల నెత్తిన చదువుల భారం ఎక్కువైందని, చదువుతో పాటు ఉల్లాసంగా ఆటలు, పాటలు, నృత్యాలు, సాంస్కృతికాంశాలలో పిల్లలను తీర్చిదిద్దే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో బాలోత్సవం గౌరవాధ్యక్షులు చలువాది మల్లికార్జునరావు, ఆఫీస్ బేరర్స్ మురళీకృష్ణ, జ్యోత్స్న, గుమ్మా సాంబశివరావు, వెన్నా వల్లభరావు, కెబిఎన్ కళాశాల కార్యదర్శి తూనుగుంట్ల శ్రీనివాసరావు, పిఎస్‌సిఎంఆర్ ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జె.లక్ష్మీనారాయణ, ఎస్‌బిఐ బ్యాంక్ కొత్తపేట మేనేజర్ ఎం.సంతోష్, బాయన వెంకట్రావు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.